


శుక్రవారం 29.08.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 135 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

## ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ కార్డు

- త్వరలో పాపులేషన్ పాలసీ... స్కీంల రీ-డిజైన్
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

ఫ్యామిలీ బెనిఫిట్ మానిటరింగ్ స్కీం సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని ప్రతీ కుటుంబ సంక్షేమం, కనీస అవసరాలు తెలుసుకునేలా క్షేత్రస్థాయిలో సమాచార వ్యవస్థను పటిష్ట పరచాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో ఫ్యామ్లీ బెనిఫిట్ మానిటరింగ్ వ్యవస్థపై సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..” రాష్ట్రంలో అన్ని సంక్షేమ పథకాలను సంతృప్తి స్థాయిలో అందించాలి. అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించాలి. ప్రతి కుటుంబానికి ఒక ఫ్యామిలీ స్కోరు కేటాయించాలి. ఆయా కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోన్న ప్రయోజనాలపై పారదర్శకంగా ఉండాలి. దీని కోసం ఫ్యామిలీ కార్డును తీసుకురండి. ప్రతి కుటుంబానికి ఆ ఫ్యామిలీ కార్డు అందించాలి. ప్రభుత్వ పథకాలను ఆ ఫ్యామిలీ కార్డులో పొందుపర్చడంతో పాటు... పూర్తి వివరాలు ఆ కార్డులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. అంతే కాకుండా... కుటుంబంలో ఎంత మంది ఉంటే.. వారందరికీ ఆ కార్డును ఇస్తే.. ఆధార్ కార్డు తరహాలో వారి అవసరాలకు ఉపయోగించుకుంటారు. ఆ కుటుంబాలను ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయాలి.” అని సీఎం సూచించారు.

**సమాచార అనుసంధానమే కీలకం :** “క్షేత్ర స్థాయిలో వివిధ అంశాలకు సంబంధించిన సమాచారం ప్రభుత్వం వద్ద పూర్తి స్థాయిలో ఉండాలి. ప్రతి శాఖకు సంబంధించిన సమాచారాన్ని క్రోడీకరించుకోవాలి.. వాటిని అనుసంధానం చేసుకోవాలి. అప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలం. పదే పదే డేటా గురించి, డేటా అనుసంధానం గురించి మాట్లాడ్డానికి బలమైన కారణం ఉంది. క్షేత్ర స్థాయికి సంబంధించిన పక్కా సమాచారం ప్రభుత్వం వద్ద ఉంటే.. దానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవచ్చు. ఇప్పుడు సోషల్ రీ-ఇంజినీరింగ్‌కు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది. బీసీ, ఎస్సీల్లో ఉన్న కొన్ని కులాలు చాలా వెనుకబడి ఉన్నాయి. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వారికి లబ్ది అందడం లేదు. ఓసీల్లో కూడా ఇంకా ఆర్థికంగా వెనుకబడి వారున్నారు. వారి అవసరాలను గుర్తించాలి. అలాంటి వారిని గుర్తించాలన్నా... వారి వెనుకబాటుతనాన్ని రూపుమాపాలన్నా... సమాచారం అవసరం. రాజకీయంగా పార్టీ యంత్రాంగం నుంచి నేను చేయాల్సింది చేస్తున్నాను. వారిని ఆర్థికంగా, సామాజికంగా ఆదుకోవాలంటే మిగతా 2లో...



## ఉల్లి రైతులు నష్ట పోకూడదు..



2లో

- ఉల్లి రైతుల నుంచి క్వింటాకు రూ.1200 చెల్లించి కొనుగోలు
- కొనుగోలు చేసిన ఉల్లిని రైతు బజార్లకు తరలించండి
- ఉల్లి రైతుల ఇబ్బందులపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

## ఫాస్ట్ ట్రాక్ లో ప్రాజెక్టుల నిర్మాణం

- ఏరోస్పేస్, ఐటీ, ఇంధనం, ఫుడ్ ప్రాసెసింగ్, ఎంఎస్ఎంఈ రంగాల్లో పెట్టుబడులు
- రూ.53,922 కోట్ల మేర పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం
- ఈ ప్రాజెక్టులతో 83,437 మందికి ఉద్యోగ అవకాశాలు
- నవంబర్ 15లోగా ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు
- బిజినెస్ సెంటర్ల తరహాలో పారిశ్రామిక పార్కులతో ఎకోసిస్టం


2లో

## యూరియా వచ్చేస్తోంది..




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ఎరువుల కొరత వెక్కిరిస్తున్న వేళ కేంద్రం శుభవార్త వినిపించింది. 10,350 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించింది. అన్ని స్టేట్‌ల కంటే వారం రోజులు ముందుగానే విశాఖ గంగవరం ఎయిర్‌పోర్టుద్వారా యూరియా చేరుకోనుంది. ఈ మేరకు కేంద్రం అంగీకరించింది. సెప్టెంబర్ మొదటి వారంలో కాకినాడ పోర్టుకు మరో 30 వేల మెట్రిక్ టన్నుల యూరియ దిగుమతి కానుంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు. మిగతా 2లో...

## మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మత్స్యకారులు వేటకువెళ్లొద్దని మంత్రి అనగాని సత్యప్రసాద్ సూచించారు. వర్షాలపై అమరావతిలో సమీక్ష నిర్వహించిన ఆయన అధికారులకు కీలక సూచనలు చేశారు. ఉత్తరాంధ్ర, అల్లూరి, ఏలూరు, ఉమ్మడి కృష్ణా జిల్లాలో ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. మత్స్యకారులు వేటకువెళ్లొద్దని సూచించారు. ప్రజల ప్రాణ,ఆస్తి రక్షణకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు.

## ఒకరికి ఊరట... ఇద్దరికి బిగ్ షాక్



2లో

## గ్రామ వైద్య సేవలకు మహర్దశ

- రూ.1,129 కోట్ల వ్యయంతో 4,472 విలేజ్ హెల్త్ క్లినిక్ ల భవనాల నిర్మాణానికి మంత్రి ఆమోదం
- ఏడాదిలోగా పనులు పూర్తి చేయాలని ఆదేశం
- భవన నిర్మాణ పనులకు 80 శాతం మేర కేంద్రం సాయమందిస్తుందని మంత్రి వెల్లడి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్న కూటమి ప్రభుత్వం 4,472 గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్ లకు భారీ వ్యయంతో సొంత భవనాల్ని నిర్మించాలని నిర్ణయించింది. ఈ నిర్మాణాల కోసం రూ.1129 కోట్లు వ్యయం చేయనుంది. 26 జిల్లాల్లో 10,032 విలేజ్ హెల్త్ క్లినిక్ లు వైద్య సేవల్ని అందిస్తున్నాయి. వీటిలో 1,086 విలేజ్ హెల్త్ క్లినిక్ లు(ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లు) ప్రభుత్వ భవనాల్లో ఉన్నాయి. మిగిలిన వాటిలో ఎక్కువ భాగం అద్దె భవనాల్లో నడుస్తున్నందున ప్రజలకు వైద్య సేవలందించే క్రమంలో పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిస్థితులపై ఉన్నతస్థాయి అధికారులతో సమీక్షించిన వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ రూ.1129 కోట్ల వ్యయంతో 4,472 గ్రామాల్లో హెల్త్ క్లినిక్ లకు సొంత భవనాలు నిర్మించడానికి ఆమోదం తెలిపారు. ఇందులో భాగంగా గత ప్రభుత్వం నిర్మాణ పనుల్ని చేపట్టి నిధుల విడుదలలో ఆలస్యం కారణంగా అసంపూర్తిగా మిగిలిపోయిన 2,309 భవనాల నిర్మాణాలను పూర్తి చేస్తారు. దీంతో పాటు మరో 2,163 నూతన భవన నిర్మాణ పనుల్ని పిఎం-అభిం(696 భవనాలు), 15వ ఆర్థిక సంఘం నిధులతో (1467 భవనాలు) చేపడతారు. హెల్త్ క్లినిక్ లకు సొంత భవనాల ప్రాధాన్యత దృష్ట్యా ఈ నిర్మాణ పనుల్ని ఏడాదిలోపు పూర్తి మిగతా 2లో...

## డ్రోన్ సాయంతో వ్యవసాయం



**నిమ్మాడ(జర్నలిస్ట్ ఫైల్) :** వ్యవసాయంలో డ్రోన్ సాంకేతికత సహాయంతో పంటల సాగు రైతులకు బహుళ ప్రయోజనకరంగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారులి. కోటబొమ్మాళి మండలం నిమ్మాడ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన డ్రోన్ సాయంతో నానో యూరియా, నానో డి ఏ పి పి మందులతో వరి పంట పొలంలో చేనుకు పిచికారి ప్రక్రియను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానో యూరియా, నానో డి ఏ పి దేశంలోనే ఇఫ్కో కంపెనీ ప్రవేశపెట్టిందన్నారు. డ్రోన్ సాంకేతికతతో వ్యవసాయం సులభతరం కానుందని, అదేవిధంగా సమయం ఆదా, శ్రమతో పాటు పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవచ్చని వెల్లడించారు. జిల్లాలో 20 డ్రోన్లు మంజూరు కాగా 18 రైతు సంఘాల గ్రూపులకు పంపిణీ చేసినట్లు స్పష్టం చేశారు. కోరమాండల్, ఇఫ్కో డ్రోన్లు వినియోగిస్తున్నారు చెప్పారు. నమో దీదీ పథకం కింద సుమారు 11 డ్రోన్లు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. రాబోయే రోజుల్లో మరిన్ని డ్రోన్ల సాంకేతికతను రైతులకు అందుబాటులోకి తెచ్చి వినియోగం పెంచనున్నామని అన్నారు. వ్యవసాయం సులభతరం, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే దిశగా రైతులు అడుగులు వేయాలని మంత్రి కోరారు. మిగతా 2లో...

## ఎత్తిపోతలకు మరమ్మతులు



**తాడేపల్లి (జర్నలిస్ట్ ఫైల్):** మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో తాడేపల్లి మండలం కుంచనపల్లి గ్రామంలో ఉన్న ఆంధ్రరత్న ఎత్తిపోతల పథకంకు మరమ్మతులు చేయించారు. సుమారు రూ. 8 లక్షల 50 వేలతో తుప్పుపట్టిన 150 హెచ్‌పీ మోటార్లకు మరమ్మతులు చేయించారు. మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో స్థానిక కూటమి నాయకులు గురువారం నూతన మోటార్లను స్విచ్ ఆన్ చేసి సాగునీటిని విడుదల చేశారు. దీనితో రైతులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదములు తెలియజేశారు. ఈ సందర్భంగా మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ మాట్లాడుతూ మోటార్లకు మరమ్మతులు చేయడంతో కుంచనపల్లి, ప్రాతూరు, గుండిమెడ, చిర్రావూరు గ్రామాల్లోని 3700 ఎకరాలకు సమృద్ధిగా సాగునీరు అందుతుందన్నారు. 2 వేల మంది రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఎత్తిపోతల పథకం స్కీం యొక్క సమస్యను రైతులు, స్థానిక నాయకులు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన రైతుల సమస్యను దృష్టిలో పెట్టుకొని వెంటనే ప్రభుత్వంతో సంబంధం లేకుండా మిగతా 2లో...

## అర్హతున్న ప్రతి ఒక్కరికీ ఫించన్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో అర్హతగల ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా ఫించన్ అందించాలని ఎక్కడైనా అర్హత ఉండి ఫించన్ రాలేదని ఫిర్యాదు వస్తే అందుకు సంబంధిత జిల్లా కలక్టరే బాధ్యత వహించాల్సి ఉంటుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ స్పష్టం చేశారు. మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు,భుగర్భ జలాలు,పియం కుసుమ్ పధకానికి భూ సంబంధిత అంశాలు,పింఛన్లు,జిల్లా జువెనైల్ జస్టిస్ కమిటీల ఏర్పాటు వాటి అమలు,ఇండియన్ ఎయిర్ ఫోర్స్ సంబంధిత అంశాలపై గురువారం రాష్ట్ర సచివాలయం నుండి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ముందుగా పింఛన్లు పంపిణీపై సిఎస్ మాట్లాడుతూ అర్హత గల ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా పెన్షన్ అందేలా చూడాలని కలెక్టర్లుకు స్పష్టం చేశారు. ప్రతినెల పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్లు,జిల్లా,మండల ప్రత్యేక అధికారులు తప్పక పాల్గొనాలని ఆదేశించారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్లు అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకుని అర్హత గలవారందరికీ తప్పనిసరిగా ఫించన్ అందేలా చూడలాని అర్హత ఉన్నా ఫించన్ రాలేదని మీడియా,సోషల్ మీడియా లేదా మరే ఇతర మార్గాల్లోనైనా ఫిర్యాదులు వస్తే అందుకు ఆయా జిల్లా కలక్టర్లే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని సిఎస్ విజయానంద్ పునరుద్ఘాటించారు.



పెన్షన్ల తనిఖీకి సంబంధించి లక్షా 35 వేల మందికి నోటీసులు జారీ చేసి నెలరోజుల్లోగా ఎంపిడిఓలకు అప్పీళ్ చేసుకోవాలని తెలియజేయాగా వారిలో 88వేల 319 మంది ఎంపిడిఓలకు అప్పీలు చేసుకోగా ఇంకా 23వేల మంది అప్పీలు చేసుకోలేదని నెలరోజుల గడువులోపు అప్పీళ్ళన్నీ పరిష్కరించాలని కలక్టర్లను సిఎస్ ఆదేశించారు. పెన్షన్ల పంపిణీపై ఎక్కడా నెగిటివ్ ప్రసారం రాకుండా చూసుకోవాలని అర్హతగల వారందరికీ తప్పనిసరిగా ఫెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మిగతా 2లో...

## క్రీడా ప్రోత్సాహకాలు విడుదల



- ఏపీ క్రీడాకారులకు కూటమి ప్రభుత్వం తీపికబురు
- రూ.4.9 కోట్ల క్రీడా ప్రోత్సాహకాలు విడుదల
- 43 మంది అంతర్జాతీయ క్రీడాకారులకు లబ్ధి

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** గత వైసీపీ ప్రభుత్వం బకాయిలు పెట్టిన రూ.4.9కోట్ల క్రీడా ప్రోత్సాహకాలను కూటమి ప్రభుత్వం విడుదల చేసి ఏపీలోని క్రీడాకారులకు తీపికబురు చెప్పిందని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మిగతా 2లో...

## ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ కార్డు



(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ యంత్రాంగం సమర్థవంతంగా పని చేయాలి. దాని కోసమే సమాచారాన్ని అనుసంధానించే అంశం మీద ఫోకస్ పెట్టాలని చెబుతున్నాను." అని చంద్రబాబు వెల్లడించారు.

**ఉమ్మడి కుటుంబాలే ఆస్తి :** "ప్రజలే ఆస్తి. వారి ద్వారానే రాష్ట్రాభివృద్ధి, దేశాభివృద్ధి. జనాభా పెరిగితే... సంపద పెరిగే రోజులు వచ్చాయి. ఇది కొనసాగాలంటే.. చక్కటి కుటుంబ వ్యవస్థ ఉండాలి. కలిసి ఉంటే కలదు సుఖం అనే మన సంస్కృతిని మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. కానీ ప్రభుత్వ పథకాల కోసం కుటుంబాలు విడిపోయే పరిస్థితి కొన్ని చోట్ల కనిపిస్తోంది. అలా జరగడం బాధాకరం. ప్రతి కుటుంబ సంతోషాన్ని కోరుకుంటున్న ప్రభుత్వమిది. పథకాల కోసం కుటుంబాలు విచ్ఛిన్నమయ్యే పరిస్థితిని తప్పించాలని భావిస్తున్నాం. దీని కోసం పాపులేషన్ పాలసీని త్వరలో తెస్తాం. అధికారులు ఆ దిశగా కసరత్తు చేయాలి. ఉమ్మడి కుటుంబాలు ఉంటే.. పథకాలు రావనే ఆందోళన లేకుండా ఉండేందుకు అవసరమైతే ప్రభుత్వ సంక్షేమ పథకాలను రీ-డిజైన్ చేస్తాం. లబ్దిదారులకు మరింత మేలు చేకూర్చడంతోపాటు... కుటుంబాలు విడిపోకుండా చూస్తాం." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఎస్ విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## యూరియా వచ్చేస్తోంది..

(మొదటి పేజీ తరువాయి)

కాగా రాష్ట్రంలో వర్షాలు పడుతున్నాయి. రైతులు పలుచోట్ల నార్లు వేస్తున్నారు. మరికొన్ని చోట్ల ఇప్పటికే నాట్లు వేశారు. అయితే పొలాలకు యూరియా కొరత తీవ్రతరమైంది. దీంతో ఉన్న కొద్ది యూరియా కోసం రైతులు తీవ్ర పాట్లు పడుతున్నారు. దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. అధిక ధరలకు కొంటున్నారు. అయినా యూరియా సరిపోవడంలేదు. ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి రాష్ట్ర నేతలు తీసుకెళ్లారు. దీంతో యూరియా దిగుమతికి అనుమతించింది.

## ఒకరికి ఊరట... ఇద్దరికి బిగ్ షాక్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** లిక్కర్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. కోర్టులో ఒకరికి ఊరట కలిగితే మరో ఇద్దరికి బిగ్ షాక్ తగిలింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న దిలీప్(ఏ30)తో పాటు రాజ్ కేసిరెడ్డి, సజ్జల శ్రీధర్ బెయిల్ కోరుతూ విజయవాడ ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై కోర్టులో గురువారం విచారణ జరిగింది. దీంతో పైలా దిలీప్‌కు ధర్మాసనం బెయిల్ మంజూరు చేసింది. కేసిరెడ్డి, సజ్జల శ్రీధర్ బెయిల్ పిటిషన్లను డిస్మిస్ చేసింది. పైలా దిలీప్ రాజ్ కేసిరెడ్డి పీఏగా పని చేశారు. జగన్ హయాంలో జరిగిన లిక్కర్ స్కాం కేసులో దిలీప్ సైతం నిందితుడిగా ఉన్నారు.. ప్రస్తుతం ఈయన కూడా జైలులో ఉన్నారు. తాజాగా బెయిల్ మంజూరు అయింది.

## ఎత్తిపోతలకు మరమ్మతులు



(మొదటి పేజీ తరువాయి)

లక్షల విలువైన సొంత నిధులతో మరమ్మతులు చేయించడంతో గొప్ప విషయమన్నారు. ఎన్నికలలో ఇచ్చిన అన్ని హామీలను మంత్రి నారా లోకేష్ అమలు చేస్తూ దేశంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా మంగళగిరిని అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. కుల, మతాలు, పార్టీలకు అతీతంగా నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కరానికి మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నట్లు చెప్పారు. గత పాలకులు తుప్పుపట్టిన పైపులను కూడా మార్చలేకపోయారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలబడి ఆదుకుంటుందన్నారు. ఇచ్చిన హామీలకు అనుగుణంగా సూపర్ సిక్స్ పథకాలు విజయవంతంగా అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు అధ్యక్షులు దాసరి కృష్ణ, జనసేన మండల పార్టీ అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, జనసేన మండల ప్రధాన కార్యదర్శి లాల్ చంద్, నీటి సంఘం అధ్యక్షురాలు మెదూరి ధనలక్ష్మి, గ్రామ పార్టీ అధ్యక్షులు, గ్రామ ప్రధాన కార్యదర్శులు, రైతులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## అర్హతున్న ప్రతి ఒక్కరికీ ఫించన్



(మొదటి పేజీ తరువాయి)

అంతకు ముందు మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, భూగర్భ జలాల పెంపు,పియం కుసుమ్ ఫథకానికి సంబంధించి భూసంబంధిత అంశాలు,జిల్లా జువనైల్ జస్టిస్ కమిటీలు ఏర్పాటు,యూరియా లభ్యత తదితర అంశాలపై కలక్టర్లతో సిఎస్ సమీక్షించారు.

ఈసమావేశంలో సిసిఎల్ఏ జి.జయలక్ష్మి,ఆర్టీజిఎస్ సిఇఒ ప్రఖర్ జైన్,ఐఅండ్పిఆర్ డైరెక్టర్ హిమాన్షు శుక్ల, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు,నెడ్ క్యాప్ ఎండి కమలాకర్ బాబు తదితర అధికారులు పాల్గొన్నారు. అదే విధంగా రాష్ట్ర జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్, సెర్ప్ సిఇఓ కురుణ,మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి సూర్యకుమారి,వివిధ జిల్లాల కలెక్టర్లు వర్చువల్ గా పాల్గొన్నారు.

# ఫాస్ట్ ట్రాక్ లో ప్రాజెక్టుల నిర్మాణం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్న పారిశ్రామిక ప్రాజెక్టులు ఫాస్ట్ ట్రాక్ లో పూర్తి కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో త్వరగా అనుమతులిస్తున్నామని... అదే తరహాలో ప్రాజెక్టుల గ్రౌండింగ్ కూడా అంతే వేగంగా జరిగేలా చూడాలని సీఎం ఆదేశించారు. సచివాలయంలో గురువారం సీఎం అధ్యక్షతన 10వ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశమైంది. రూ. 53922 కోట్ల మేర పెట్టుబడులు పెట్టే 30 ప్రాజెక్టులకు సీఎం ఆధ్వర్యంలోని ఎస్ఐపీబీ ఆమోదించింది. ఈ ప్రాజెక్టుల ద్వారా 83,437 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్న ప్రాజెక్టుల పురోగతిపై ఇక నుంచి ప్రతీ నెలా సమీక్షస్తానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుల్లో స్థితిగతులపై క్షేత్రస్థాయిలో మంత్రులు కూడా పరిశీలించాలని సీఎం స్పష్టం చేశారు. ఇప్పటి వరకూ అనుమతులిచ్చిన ప్రాజెక్టుల వివరాలను, ఉత్పత్తి ప్రారంభించేందుకు ఎంత సమయం పట్టిందన్న అంశాలను విశ్లేషించాలని సీఎం సూచించారు. ఏ ప్రాజెక్టు అయినా ఆలస్యం అవుతుంటే సంబంధిత సంస్థల ప్రతినిధులతో మాట్లాడి పనులు వేగంగా పూర్తి చేసేలా చూడాలన్నారు. రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని అమలు చేస్తున్నామని.. అధికారులు కూడా అదే వేగంతో పనిచేయాలని సూచించారు. మహీంద్రా ఈవీ వాహనాల ఉత్పత్తి ప్లాంట్ ను ఏపీలో ఏర్పాటు చేసేలా తానే స్వయంగా సంప్రదిస్తున్నానని.. దీనికి అనుగుణంగా అధికారులూ స్పందించాలని సీఎం అన్నారు.



**ఏపీలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలదే ప్రధాన భూమిక :** వ్యవసాయ ఆధారిత రాష్ట్రమైన ఏపీలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలే కీలకమని.. వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపుతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇవి ప్రధాన భూమిక పోషిస్తాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హార్టీకల్చర్ హబ్ గా రాయలసీమతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు పుష్కలంగా అవకాశాలున్నాయని అన్నారు. పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించేందుకు అధికారులు ప్రముఖ కంపెనీలతో సంప్రదింపులు చేయాలని సీఎం సూచించారు. చిత్తూరు, అన్నమయ్య తదితర జిల్లాల్లో స్థానికంగా ఉన్న మ్యాంగో ప్రాసెసింగ్ పరిశ్రమల వల్లే రైతులకు ఎక్కువ ఇబ్బంది లేకుండా చూడగలిగామని అన్నారు. పొరుగున తమిళనాడు, కర్ణాటకలలో ఈ తరహా ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు లేవన్నారు.

**బిజినెస్ సెంటర్ల తరహాలో ఎంఎస్ఎంఈ పార్కులతో ఎకోసిస్టం :** రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు పూర్తి కావాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇప్పటికే ప్రారంభించిన ప్రాంతాల్లో మినహా మిగతా నియోజకవర్గాల్లో 3 నెలల్లో ఈ పార్కులు అందుబాటులోకి రావాలన్నారు. ఈ పారిశ్రామిక పార్కులన్నీ బిజినెస్ సెంటర్లలా చేసి.. ఒక ఎకో సిస్టంను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతులు, భూ యజమానుల్ని కూడా ఈ పారిశ్రామిక పార్కుల్లో భాగస్వాములను చేయాలని సీఎం స్పష్టం చేశారు. తద్వారా వారికి ఆదాయం వచ్చేలా చేయాలని అన్నారు. అలాగే రాష్ట్రంలో మెగా, మీడియం స్థాయిలో పారిశ్రామిక పార్కులను నియోజకవర్గాల వారీగా మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. ఈ పారిశ్రామిక పార్కులకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లను అనుసంధానించటంతో పాటు వాటికి ప్రామాణిక మార్గదర్శకాలను నిర్దేశించాలన్నారు. పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో ఆర్టీఐహెచ్ ద్వారా జరిగే కార్యకలాపాలను సమీక్షించాలని సీఎం సూచించారు. మరోవైపు రాష్ట్రంలోని ఆటోనగర్ లలో రెడ్, ఆరెంజ్ కేటగిరీ పరిశ్రమలకు తదుపరి అనుమతులు రాకపోవటంపై సమీక్షించిన సీఎం దీనికి తగిన కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. ఏపీకి పరిశ్రమలు రావటం ముఖ్యమన్న సీఎం.. ఇంధన ఉత్పత్తి, ఐటీ, టూరిజం, ఫుడ్ ప్రాసెసింగ్, మైనింగ్ ఆధారిత వాల్యూ చైన్ పరిశ్రమల్లో పెట్టుబడులు రావాల్సి ఉందన్నారు. అలాగే ఐటీ రంగంలో వర్క్ ఫ్రమ్ హోమ్, కో-వర్కింగ్ స్పేస్ లను ఏర్పాటు చేయాలన్నారు. మరోవైపు గత పాలకులు తిరుపతి వేంకటేశ్వరస్వామి ఏడుకొండల పవిత్రతను దెబ్బతీసేలా ప్రవర్తించారని.. కొండను ఆనుకుని హోటల్ నిర్మాణానికి స్థలం కేటాయించిందన్నారు. కూటమి అధికారంలోకి రాగానే భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయంగా స్థలం చూపామని అన్నారు. దీనిపై కొందరు దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని సీఎం వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్, టీజీ భరత్, అనగాని సత్యప్రసాద్, వాసంశెట్టి సుభాష్, సీఎస్ కె.విజయానంద్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# గ్రామ వైద్య సేవలకు మహర్దశ

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని, ఈమేరకు నిర్మాణ పనుల్ని చేపట్టనున్న పంచాయితీరాజ్ శాఖతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని మంత్రి సూచించారు.

**గత ప్రభుత్వ హయాంలో కుంటుపడిన పనులు :** మొత్తం 8,946 విలేజ్ హెల్త్ క్లినిక్ లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా గత ప్రభుత్వం 3,105 భవనాల్ని మాత్రమే నిర్మించింది. ఎన్ఆర్ ఇజియస్, ఎన్ హెచ్ఎం నిధులతో మరో 2,309 భవన నిర్మాణ పనులు ప్రారంభించి అర్థాంతరంగా నిలిపివేసింది. ఇలా చేపట్టిన 5,414 భవన నిర్మాణాలకు ఒక్కోదానికి రూ. 8.75 లక్షలు చొప్పున కేంద్రమిచ్చే ఎన్ఆర్ ఇజియస్ నిధులను వాడారు. 2019-20 నాటి రేట్ల ప్రకారం ఒక్కో భవనం నిర్మాణానికి రూ. 20.80 లక్షలుగా అప్పట్లో నిర్ధారించారు. ఎన్ఆర్ ఇజియస్ నిధులకు అదనంగా ఒక్కో భవన నిర్మాణానికి ఎన్‌హెచ్ఎం పథకం కింద రూ. 12.05 లక్షలను కేటాయించగా ఇందులో కేంద్రం 60 శాతం వాటాను అందించింది. అయినా నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయి.

**భారీగా కేంద్ర సాయం :** గ్రామ స్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించే ఉద్దేశంతో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్రమోడీ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల స్థాపనకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా మున్నెన్నడూ లేనివిధంగా ప్రతి గ్రామంలో హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం ప్రారంభం చేశారు. ఈ మేరకు రాష్ట్రంలో హెల్త్ క్లినిక్ లకు సొంత భవనాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం భారీగా సాయమందించిందని మంత్రి శ్రీ సత్యకుమార్



యాదవ్ వెల్లడించారు. గత ప్రభుత్వంలో చేపట్టిన నిర్మాణ పనులకు, ఇప్పుడు చేపట్టనున్న నిర్మాణ పనులకు అవసరమయ్యే మొత్తం ఖర్చులో 80 శాతాన్ని కేంద్రమే అందిస్తోందని మంత్రి తెలిపారు. హెల్త్‌క్లినిక్ నిర్మాణాల కోసం ఎన్‌హెచ్ఎం మరియు పిఎం-అభిమ్ పథకాల కింద కేంద్రం 60 శాతం ఖర్చును భరిస్తుందని, దీంతోపాటు 100 శాతం గ్రాంటుగా లభించే 15వ ఆర్థిక సంఘం నిధులతో కూడా హెల్త్ క్లినిక్ నిర్మాణ పనులను చేపడుతున్నామని మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వివరించారు. ఈ మేరకు ఇప్పటి వరకు చేపట్టిన నిర్మాణ పనులు, ఇప్పుడు ఆమోదించిన నిర్మాణ పనులకు మొత్తం రూ. 2,254 కోట్లు ఖర్చవుతుందని, ఇందులో రూ. 1,808 కోట్లు కేంద్ర సాయమని మంత్రి తెలిపారు. దరిమిలా... రాష్ట్రంలో హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులకు అయ్యే మొత్తం ఖర్చులో 80 శాతం కేంద్రమే అందిస్తోందని మంత్రి విశదీకరించారు.

రాష్ట్రంలో మరో 1,379 నూతన భవనాలను రూ. 753 కోట్ల ఖర్చుతో నిర్మించాల్సి ఉందని, వీటిని 16వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని మంత్రి తెలిపారు. పూర్తి గ్రాంటుగా లభించే ఈ నిధులతో కలిపి రాష్ట్రంలో హెల్త్ క్లినిక్ భవనాలకు అయ్యే మొత్తం ఖర్చులో 85 శాతం కేంద్రమే ఇచ్చినట్లవుతుందని మంత్రి వివరించారు. ఈ భారీ సాయానికి ప్రధాన మంత్రి మోదీకి మంత్రి సత్యకుమార్ యాదవ్ ధన్యవాదాలు తెలిపారు.

**జిల్లాల వారీగా భవన నిర్మాణ వివరాలు :** రూ. 1129 కోట్ల వ్యయంతో చేపట్టనున్న భవన నిర్మాణ పనుల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లాలో అత్యధికంగా 284 విలేజ్ హెల్త్ క్లినిక్ లకు సొంత భవనాలు ఏర్పడనున్నాయి. తరువాతి క్రమంలో నంద్యాల జిల్లాలో 272, ఏలూరు జిల్లాలో 263, కోనసీమ జిల్లాలో 242, కృష్ణా జిల్లాలో 240, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 239, చిత్తూరు జిల్లాలో 229, బాపట్ల జిల్లాలో 211, పార్వతీపురం మన్యం జిల్లాలో 205, ప్రకాశం మరియు నెల్లూరు జిల్లాల్లో 203 చొప్పున, అనకాపల్లి జిల్లాలో 200 నూతన భవనాలు ఏర్పడతాయి.

గుర్తించిన అవసరాల మేరకు...రాయలసీమలోని తిరుపతి, కర్నూలు, అన్నమయ్య, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో ఒక్కోచోట 100కి పైగా నూతన భవనాల్ని నిర్మిస్తారు.

# ఉల్లి రైతులు నష్ట పోకూడదు..

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఇబ్బందుల్లో ఉన్న ఉల్లి రైతును ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. రైతుల నుంచి ఉల్లిని తక్షణమే కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం నుంచే క్వింటాకు రూ. 1200 చెల్లించి ఉల్లిని కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయంలో రైతుల నుంచి ఉల్లి కొనుగోళ్లపై గురువారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, మార్కెటింగ్ విభాగం అధికారులు హాజరయ్యారు. ఉల్లి రైతుల పరిస్థితి, ఉల్లి ధరలు ఏ మేరకు ఉన్నాయనే అంశంపై చంద్రబాబు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఉల్లి పంటకు సంబంధించిన క్రయ విక్రయాలపై అంశంపై చర్చించారు. ఉల్లి పంట దెబ్బ తిన్న కారణంగా.. మహారాష్ట్ర ఉల్లి పంట ఎక్కువగా ఉన్న కారణంగా ధరల విషయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారులు తెలిపారు. వచ్చే పది రోజుల్లో 5 వేల మెట్రిక్ టన్నుల ఉల్లి పంట వచ్చే అవకాశం ఉందని సీఎంకు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.."ఉల్లి రైతులకు నష్టం వాటిల్లకూడదు. క్వింటా ఉల్లిని రూ. 1200 చొప్పున



కొనుగోలు చేయండి. తక్షణం కొనుగోళ్లు ప్రారంభించాలి. మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ నుంచి నష్టాన్ని భరించాలి. కమ్యూనిటీ హాళ్లల్లో అద్దెకు తీసుకుని ఆరబెట్టాలి. ఆరబెట్టిన ఉల్లిని రైతు బజార్లకు పంపిణీ చేయాలి. ఉల్లికి రేటు వచ్చేంత వరకూ కమ్యూనిటీ హాళ్లల్లో నిల్వ చేసుకునేందుకు రైతులకు అవకాశం కల్పించాలి. రైతు నష్టపోకూడదు.. వినియోగదారుడు ఇబ్బంది పడకూడదు. అన్ని పంటల ధరల స్థిరీకరణ కోసం వేర్ హౌసింగ్ సదుపాయం కల్పించాలి." అని ముఖ్యమంత్రి అన్నారు.

**రైతు బజార్ల ఆధునీకరణకు చర్యలు :** రాష్ట్రంలోని రైతు బజార్ల సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపట్టాలని సీఎం మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న రైతు బజార్ల సంఖ్యను పెంచాలని సూచించారు. వీటిని 150 నుంచి 200 వరకూ చేసేలా ప్రణాళిక చేయాలని అన్నారు. దీనిపై సీఎం మాట్లాడుతూ "రైతు బజార్లను నెక్స్ట్ లెవల్ కు తీసుకెళ్లాలి. మార్కెట్ యార్డుల్లోని 2-3 ఎకరాల భూమిని వినియోగించుకుని కొత్తగా ఆధునిక రైతు బజార్లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ చేపట్టాలి. మార్కెట్ యార్డుల్లో వేర్ హౌసింగ్, కోల్డ్ చైన్ లను కూడా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు చేయండి. రైతులకు, వినియోగదారులకు ఉపయోగపడేలా మార్కెట్ యార్డు స్థలాలు వినియోగించాలి. ధరల నియంత్రణకు.. ద్రవ్యోల్బణం పెరగకుండా ఈ చర్యలు ఉపకరిస్తాయి." అని సీఎం అన్నారు.

## అన్నదానం మహాదానం

**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్):** వినాయక చవితి సందర్భంగా గుంటూరు నగరంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక చవితి మండపాలను తూర్పు ఎమ్మెల్యే నసీర్ గురువారం దర్శించుకున్నారు. మండపాల్లో వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన ఉన్న కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ విఘ్నేశ్వరుని ఆశీస్సులు సర్వజనావళిపై ఉండాలని, ఉత్సవాలను సంతోషంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. అన్నదానం మహాదానమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## డ్రోన్ సాయంతో వ్యవసాయం



(మొదటి పేజీ తరువాయి)

రైతులు సాంకేతికను అందిపుచ్చుకొని వ్యవసాయం లాభసాటిగా మారాలని సూచించారు. డ్రోన్ వినియోగం, నానో యూరియా, డి ఏ పి పిచికారి విధానాన్ని, రైతులకు ఎంతమేర ప్రయోజనంగా ఉంటుంది అన్న విషయాలను అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. అనంతరం నానో యూరియా, డి ఏ పి పిచికారి మందులను మంత్రి చేతులమీదుగా రైతులకు పంపిణీ చేశారు.

ఒక యూరియా బస్తా (45కేజీలు)బదులు , ఎకరానికి నానో యూరియా ప్లస్ సూక్ష్మ కణాల రూపంలో వాడకం జరుగుతుందని అర లీటర్ ధర రూ. 225 లు ఉంటుందన్నారు. నానో యూరియా పిచికారి వలన నేలపై నేరుగా పడకుండ వరి వంగడం పైన పడి పెరుగుదలకు పనిచేస్తుందని అన్నారు. డ్రోన్ సాయం విధానం మొక్క జొన్న, వరి పంట సాగు చాలా అనుకూలంగా ఉన్నట్లురైతులు సంతోషాన్ని వ్యక్తపరిచారని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు త్రినాధ స్వామి మంత్రికి వివరించారు.

**పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు :** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని రైతులతో నిర్వహించారు. ఈ సందర్భంగా కోరమండల్, ఇఫ్కో ఎరువుల కంపెనీలు డ్రోన్ సహాయంతో పొలంలో పిచికారి విధానాన్ని రైతులకు అవగాహన కల్పించారు. ఎంత మేర వరకు యూరియా, ఎంత శాతం నీరు మిశ్రమాన్ని కలిపే విధానాన్ని వ్యవసాయ అధికారులు రైతులకు స్థాయిలో అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో మాజీ పి ఏ సి ఎస్ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జగన్మోహన్, కోటబొమ్మాళి, టెక్కలి వ్యవసాయ అధికారులు గోవింద రావు, శ్రీనివాస రావు, ఇఫ్కో, కోరమాండల్ ఫెర్టిలైజర్ కంపెనీ ప్రతినిధులు లోకేష్, శ్రీరామ్, తదితరులు, పాల్గొన్నారు.

## క్రీడా ప్రోత్సాహకాలు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా రూ. 4కోట్ల 9లక్షల 2వేలు బకాయిలను విడుదల చేయడం సంతోషదాయకమని పేర్కొన్నారు. దీనివల్ల ఏపీలో 43మంది అంతర్జాతీయ క్రీడాకారులకు లబ్ధి చేకూరిందని, తద్వారా వారు క్రీడల్లో మరింత రాణిచ్చేందుకు ఈ ప్రోత్సాహకాలు ఉపయోగపడతాయని వివరించారు. క్రీడలు, క్రీడాకారుల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకుందని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా క్రీడాకారులందరూ సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాప్రోత్సాహకాలు విడుదల చేసిన సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డికి క్రీడాకారుల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**లబ్ధి పొందిన క్రీడాకారులు.. :** కిదాంబి శ్రీకాంత్, సాత్విక్ సాయిరాజ్, ధీరజ్ బొమ్మదేవర, షేక్ జాఫ్రిన్, షేక్ సాథియా ఆల్మస్, ఎ.అజయ్ కుమార్ రెడ్డి, డి.గ్రీష్మ, ఎం.సాహితి వర్షిని, ఏ శివనాగిరెడ్డి, రాయుడు అరుణ్ కుమార్, ఎ.సాయిసంహిత, కె.మోహన్ కిరణ్ కుమార్, కె.నారాయణ, కె.సంధ్య, ఎమ్.సత్యవతి, వి.రావణి, డి.వెంకటేశ్వర్, రియాజ్ సాబూ, గంపా ఆదిత్య వరుణ్, వి.మౌనిక, నాగ జ్ఞానదివ్య, మొదలగు వారు ఉన్నారు.

## ఆ మూడు పార్టీలపై ప్రజలకు నమ్మకం పోయింది

**మెదక్ :** రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల ముందు హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక ప్రజలను గాలికొదిలేయడం కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు. మెదక్ పట్టణంలో భారీ వర్షాల కారణంగా పునరావాస కేంద్రంలో తలదాచుకుంటున్న బాధితులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆహార ప్యాకెట్లు అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలోని పార్టీల తీరు వల్ల ప్రజలకు వాటిపై పూర్తిగా నమ్మకం పోయిందని అన్నారు. "కాంగ్రెస్ 12 సార్లు, బీజేపీ 4 సార్లు, కేసీఆర్ రెండు సార్లు గెలిచారు. కానీ ఇన్నేళ్లుగా ప్రజలు మాత్రం గెలవలేకపోయారు" అని ఆయన వ్యాఖ్యానించారు. భారీ వర్షాలతో ప్రజలు తినడానికి తిండి, ఉండటానికి నీడ లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వానికి కనీస బాధ్యత లేదా? అని ప్రశ్నించారు. అభివృద్ధిని పక్కనపెట్టి, మూడు పార్టీలు ఒకరిపై ఒకరు బురద చల్లుకోవడమే పనిగా పెట్టుకున్నాయని పాల్ విమర్శించారు. రాష్ట్రంలో కుల, మత, అవినీతి రాజకీయాలు చేసే పార్టీలను ప్రజలు భూస్థాపితం చేసినప్పుడే మంచి రోజులు వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

# ప్రభుత్వ వైద్యులకు ప్రొఫెసర్లుగా పదోన్నతి

**నిబంధనల్ని సడలించి పదోన్నతి కల్పించిన ప్రభుత్వం**

**9 మంది డీడీలకు జేడీలుగా పదోన్నతి**

**మంత్రి జోక్యంతో 20 ఏళ్ల తర్వాత ప్రమోషన్**

**పోస్టింగ్‌లను ఆమోదించిన మంత్రి సత్యకుమార్ యాదవ్**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ వైద్య కళాశాల్లో ప్రొఫెసర్ల కొరతను అధిగమించడానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలతో 63 మందికి పదోన్నతి లభించింది. జాతీయ వైద్య సంఘం(ఎన్ఎంసి) నియమాల మేరకు వివిధ కళాశాలల్లో ప్రొఫెసర్ల అవసరాలను తీర్చడానికి ప్రభుత్వం నియమాలను సడలించింది. నిబంధనల మేరకు అసోసియేట్ ప్రొఫెసర్ గా మూడేళ్లు పనిచేసిన వారు ప్రొఫెసర్ పదోన్నతికి అర్హులు. దీనిని సడలింపు చేస్తూ...ఒక ఏడాది అనుభవమున్న అసోసియేట్ ప్రొఫెసర్లను ప్రొఫెసర్లుగా నియమించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఈ మేరకు 11 క్లినికల్ విభాగాలు, 2 నాన్ క్లినికల్ విభాగాల్లో 63 మందిని డిపిసి(డిపార్టమెంటల్ ప్రమోషన్ కమిటీ) పదోన్నతికి సిఫారసు చేసింది. ఈవిధంగా పదోన్నతి పొందిన ప్రొఫెసర్లకు పోస్టింగులిస్తూ వైద్యారోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ నేడు ఆదేశాలు జారీ చేశారు.

పదోన్నతి పొందిన వారిలో ఆప్తమాలజీ విభాగంలో 11 మంది, డెర్మటాలజీలో 9, ఇఎన్‌టి మరియు ఆర్థోపెడిక్స్‌లో ఏడుగురు చొప్పున, ఎనస్థీషియా మరియు పిడియాట్రిక్స్‌లో ఐదుగురు చొప్పున, సైక్రియాట్రీలో నలుగురు, జనరల్ సర్జరీలో ముగ్గురు, జనరల్ మెడిసిన్‌లో ఇద్దరు, రేడియాలజీలో ఇద్దరు, గైనకాలజీలో ఒకరు పదోన్నతి పొందారు. నాన్ క్లినికల్ సబ్జెక్టులకు సంబంధించిన ఫోరెన్సిక్ మెడిసిన్‌లో ఐదుగురు, కమ్యూనిటీ మెడిసిన్ లో ఇద్దరు ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందారు.

**లక్ష్యానికి చేరువగా... :** ఎన్ఎంసి నిబంధనల మేరకు మొత్తం 74 మందిని ప్రొఫెసర్లుగా ప్రమోట్ చేసేందుకుగాను నిబంధనల్ని సడలించడానికి ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. ఈ లక్ష్యానికి చేరువగా పదోన్నతికి 63 మంది అంగీకరించడం హర్షదాయకమని మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ తెలిపారు. పదోన్నతికి అంగీకరించిన వీరిలో 35 మంది కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల్లోనూ, 38 మంది పాత ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పనిచేయడానికి అంగీకరించగా....ఆమేరకు మంత్రి వారికి పోస్టింగులిచ్చారు.

**20 ఏళ్లకు ప్రమోషన్ :** వైద్యారోగ్య శాఖలో దీర్ఘకాలం పదోన్నతికి నోచుకోని డెప్యూటీ డైరెక్టర్లకు ఎట్టకేలకు ప్రమోషన్ లభించింది. సర్వీసు నియమాల ప్రకారం రెండేళ్లు డీడీగా పనిచేసిన వారు జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతికి అర్హులు. అయినా, డిపిహెచ్ పరిధిలో పనిచేస్తున్న ఐదుగురు డెప్యూటీ డైరెక్టర్లు 18 నుండి 20 సంవత్సరాలుగా పదోన్నతి కోసం ఎదురు చూస్తున్నారు. మరో ఇద్దరు 11 సంవత్సరాలకు పైగా నిరీక్షిస్తున్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ జోక్యంతో వారికి ప్రమోషన్ లభించగా ఆ ఏడుగురికి మంత్రి పోస్టింగులిచ్చారు. పదోన్నతి పొందిన వీరు ప్రస్తుత స్థానాల్లోనే జేడీలుగా కొనసాగుతారు.

మందుల నియంత్రణ విభాగంలో పనిచేస్తున్న ఇద్దరు డెప్యూటీ డైరెక్టర్లకు పదోన్నతిపై జాయింట్ డైరెక్టర్లుగా మంత్రి పోస్టింగులిచ్చారు. రాజాభానును హెడ్ క్వార్టర్స్‌లోనూ, పాండురంగ ప్రసాద్‌ను విశాఖపట్నంలోనూ పోస్ట్ చేశారు.

## హెూం గార్డుల స్వరాష్ట్రాల బదిలీ సమస్యను పరిష్కరించండి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ గురువారం సచివాలయంలో కలిశారు. వివిధ సమస్యలపై వినతి పత్రాలు అందించారు. ఉమ్మడి రాష్ట్రంలో హెూంగార్డులుగా నియామకం పొందిన ఏపీ, తెలంగాణ రాష్ట్రాల స్థానికత కలిగిన హెూంగార్డుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. తెలంగాణలో ఏపీ స్థానికత, ఏపీలో తెలంగాణ స్థానికత కలిగిన హెూం గార్డులు పనిచేస్తున్నారని సీఎంకు వివరించారు. వీరు ఇంకా వారి వారి స్వరాష్ట్రాలకు బదిలీ కాకపోవడంతో చాలా అవకాశాలు కోల్పోతున్నారని రామకృష్ణ చెప్పారు. కానిస్టేబుల్స్ సెలెక్షన్స్ విషయంలో వీరికి రెండు రాష్ట్రాల్లోనూ సాంకేతిక సమస్యలు ఎదురువుతున్నాయని చెప్పారు. వీరిని వారి స్వరాష్ట్రాలకు బదిలీ చేయించేలా చొరవ తీసుకోవాలని సీఎంను కోరారు. ఇక రాష్ట్రంలో యూరియాతోపాటు.. రైతులకు అవసరమైన ఎరువులనూ అందుబాటులోకి తీసుకురావాలని వినతి సీఎంకు వినతి పత్రం సమర్పించారు. సీఎంను కలిసిన వారిలో ఆ పార్టీ నేత ముప్పాళ్ళ నాగేశ్వరరావు ఉన్నారు.

## అత్యధిక టీచర్ పోస్టులు భర్తీ చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదే



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో అత్యధిక టీచర్ పోస్టులను భర్తీ చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కే దక్కుతుందని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు తెలిపారు. మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన చల్లపల్లి కి చెందిన మట్ట మహీమ,రాయవరపు మధు లను సురేష్ బాబు వారి నివాసాలకు వెళ్లి అభినందించారు. ఈసందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి మంత్రి గా తన పదవీకాలం లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో పలు డీఎస్సీ లు నిర్వహించి లక్షలాది ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారని సురేష్ తెలిపారు. టీచర్ పోస్టుల భర్తీలో ఎలాంటి పైరవీలకు తావు లేకుండా పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించారని ప్రశంసించారు. ఉపాధ్యాయులపై రాజకీయ ఒత్తిళ్లకు తావు లేకుండా బదిలీల ప్రక్రియలో కౌన్సిలింగ్ విధానాన్ని ప్రవేశపెట్టిన చంద్రబాబు నాయుడు చరిత్రలో నిలిచిపోతారన్నారు. పట్టుదల, నిజాయితీతో కృషి చేస్తే విజయాలు సాధించడం కష్టం కాదని మహీమ,మధు లు నేటి యువతకు రుజువు చేశారన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో జీవితంలో అనేక రకాలుగా ఉపయోగపడుతున్న సమాజం,ప్రకృతికి ఉద్యోగులు ఎంతోకొంత తిరిగి ఇచ్చే తత్వాన్ని అలవర్చుకోవాలని సురేష్ బాబు సూచించారు. ఈ సందర్భంగా మెగా డీఎస్సీ విజేతలకు శాలువా సత్కరించి,అంబేద్కర్ జీవిత విశేషాలతో కూడిన పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు డి.భాస్కరరావు, ఎం.రజాకర్ రావు,లలిత కుమారి, కృపామణి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సంచార జాతుల అభివృద్దే లక్ష్యం



కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్):సంచార జాతుల అభివృద్దే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ స్ఫూర్తి అనేక కార్యక్రమం ను నిర్వహిస్తుందని బీజేపీ మైనారిటీ మోర్చ రాష్ట్ర నాయకులు డా. షేక్ అబ్దుల్ ఖుద్దుస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంచార జాతులు సదాచార వారసులు సంస్కృతికి వారధులు లని తెలిపారు. మన దేశ సంస్కృతి నీ ,ప్రకృతితో ఉన్న అనుబంధాన్ని తెలిపేలా జీవిస్తున్న సంచార జాతుల ప్రజల సంక్షేమం,అభివృద్ధి లక్ష్యంగా సంచార జాతుల వికాసం కొరకు ఈ నెల 30 వ తేదీన భారతీయ జనతా పార్టీ విజయవాడ నోవేటెల్ హెూటల్ ఎదురుగా ది వెన్యు ఫంక్షన్ హాల్ నందు ఉదయం 11 గంటలకు స్ఫూర్తి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో ప్రధానంగా సంచార జాతుల ప్రజల అభివృద్ధి,సంక్షేమం,సమస్యల పరిష్కారం కొరకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో వారికి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక లు చేపట్టనున్నట్లు తెలిపారు. దేశం లో కేంద్ర ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల అభివృద్ధి లక్ష్యం గా పనిచేస్తుందని అన్నారు. సంచార జాతుల ప్రజలు ఈ కార్యక్రమం లో పాల్గొని భవిష్యత్ కు బంగారు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భముగా స్థానిక బీజేపీ నాయకులు జిల్లా కార్యదర్శి వెంకట లక్ష్మి,జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీధర్ శర్మ,ఆదిలక్ష్మి,సజ్జన రావు,రాం గోపాల్ లు ఈ నెల 30 న జరగనున్న స్ఫూర్తి కార్యక్రమం కు సంచార జాతుల ప్రజలకు అవగాహన కల్పించి కార్యక్రమం లో అధిక సంఖ్యలో హాజరవనున్నట్లు తెలిపారు.

## విశాఖలో ఆసియాలోనే అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్

**అమరావతి:** విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుపై అధికారిక ప్రకటన వెలువడింది. విశాఖలో 6 బిలియన్ డాలర్లతో డేటా సెంటర్ ఏర్పాటును ధ్రువీకరిస్తూ ఇన్వెస్ట్ ఇండియా ఎక్స్‌లో పోస్టు చేసింది. దీనిపై కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ కూడా అధికారికంగా నిర్ధరించింది. ఒక గిగావాట్ సామర్థ్యంతో ఆసియాలోనే అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ విశాఖలో నిర్మాణం కానుంది. గ్రీన్ ఎనర్జీ వినియోగంతో గేమ్ ఛేంజర్‌గా నిలవనుంది. మూడు సముద్రపు కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ల ద్వారా విశాఖలో ఈ కేంద్రం ఏర్పాటుకానుంది. ముంబయికి రెండు రెట్ల సామర్థ్యంతో రూపుదిద్దుకోనుంది.

హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ తరహాలో విశాఖలోని మధురవాడ దగ్గర 500 ఎకరాల్లో డేటా సిటీని అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. హౌసింగ్ డేటా సెంటర్లు, కృత్రిమ మేధ (ఏఐ) హబ్‌ల ఏర్పాటుకు అందులో చోటు కల్పించనుంది. డీప్ టెక్నాలజీ, బిగ్ డేటా, ఏఐ రంగాల్లో ప్రపంచ వ్యాప్తంగా విస్తృత అవకాశాలున్నాయని భావిస్తున్న ప్రభుత్వం.. వాటిని అందిపుచ్చుకోవడానికి ఈ డేటా సిటీపై ప్రత్యేక దృష్టి సారించింది.

# రైతులకు శుభవార్త



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర రైతాంగానికి వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మరోక శుభవార్త తెలిపారు. యూరియా సరఫరా విషయంపై కేంద్ర వ్యవసాయ ఎరువుల రసాయనిక మంత్రితో మాట్లాడటంతో నేడు రాష్ట్రానికి 10,350 మెట్రిక్ టన్నుల యూరియా గంగవరం పోర్టునకు చేరుకుంటున్నదని మంత్రి అచ్చెన్న తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనకు సత్వరమే సానుకూలంగా స్పందించి రాబోయే సెప్టెంబర్ నెల 6 వ తేదీనాడు రావలసిన యూరియా సరుకును వారం ముందుగానే రాష్ట్రానికి సరఫరా చేసినందుకు కేంద్రానికి మంత్రి అచ్చెన్న ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో త్వరితగతిన యూరియా రాష్ట్రానికి చేరుకుంటుందని అన్నారు. ఇండియన్ పొటాష్ లిమిటెడ్ ( ఐ పి యల్) కంపెనీ ద్వారా ఈ ఎరువులను గంగవరం పోర్టులో దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిపారు . రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లోని వ్యవసాయ పంటల సాగు పరిస్థితి, వాటి దశలను బట్టి యూరియా అవసరాలను శాస్త్రీయంగా బేరీజు చేసుకుంటూ,ప్రణాళిక బద్ధంగా అత్యంత అవసరం ఉన్న ప్రాంతాలకు, తక్షణ పంట అవసరాలకు అనుగుణంగా మాత్రమే ,వ్యవసాయ అధికారుల పూర్తి పర్యవేక్షణలో రైతులకు యూరియా ను సరఫరా చేయాలని వ్యవసాయ శాఖ కమీషనర్ డిల్లీ రావుకు మంత్రి ఆదేశించారు. సెప్టెంబర్ నెల మొదటి వారంలో కాకినాడ పోర్ట్ కు సుమారు మరొక 25000 మెట్రిక్ టన్నుల యూరియాకు తక్కువ కాకుండా సరఫరాకు కేంద్రం హామీ ఇచ్చిందని మంత్రి తెలిపారు. రైతులు యూరియా సరఫరా విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ ఖరీఫ్ సీజన్ కి యూరియా పుష్కలంగా లభిస్తుందని హామీ ఇచ్చారు . రైతులు వారి పంట తక్షణ అవసరాలకు మాత్రమే యూరియాను కొనుగోలు చేయాలని, వచ్చే రబీ సీజన్ కు ముందుస్తు కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని రైతులను మంత్రి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎరువులను ఇతర రాష్ట్రాలకు , పక్కదారి మళ్ళకుండా,అధిక ధరలకు అమ్మకుండా , నిఘా ఎన్ఫోర్స్మెంట్ ను మరింత కట్టుదిట్టం చేసి ,కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు . ప్రతి జిల్లాలో కలెక్టర్ , ఎస్పీల ఆధ్వర్యంలో వ్యవసాయ , పోలీసు ,విజిలెన్స్ ,రెవెన్యూ ,పరిశ్రమల అధికారులతో సంయుక్త టీమ్ లను ఏర్పరిచి తనిఖీలను చేస్తున్నామని తెలిపారు

## విజయవాడ ప్రీమియర్ లీగ్ టీ-20 మ్యాచ్‌ల నిర్వహణ తేదీల్లో మార్పు

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** ఎంపీ కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో కేశినేని ఫౌండేషన్ ద్వారా నిర్వహించే విజయవాడ ప్రీమియర్ లీగ్ కు క్రికెట్ ప్లేయర్ ఎంపిక కోసం క్వాలిఫైయర్ టోర్నమెంట్ సెప్టెంబర్ 3వ తేదీ ప్రారంభం కానుంది.

గతంలో రిజిస్ట్రేషన్ చివరి తేదీ ఆగస్ట్ 30గా, క్వాలిఫైయర్ టోర్నమెంట్ సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభమవుతందని ప్రకటించారు. అయితే క్రికెట్ ప్లేయర్స్ అభ్యర్థన మేరకు రిజిస్ట్రేషన్ గడువు పొడిగించటం జరిగింది. ఈ మేరకు ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది.

ఈ టోర్నమెంట్ లో ఆడాలనుకునే క్రికెట్ క్రీడాకారులు వారి టీమ్ వివరాలను సెప్టెంబర్ 1 తేదీ లోపు అందించాలి. కృష్ణాజిల్లా క్రికెట్ అసోసియేషన్ నందు టీమ్ పేర్లు ఇతర వివరాలు నమోదు చేయించుకోవాలి. 17 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల మధ్య వున్న వారు మాత్రమే ఈ టోర్నమెంట్ లో పాల్గొనటానికి అర్హతగా నిర్ణయించారు. ఈ టోర్నమెంట్ లో పాల్గొనే క్రికెట్ ప్లేయర్స్ ఆధార్ కార్డ్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ లతో పాటు పాస్ పోర్ట్ సైజ్ ఫోటో సమర్పించాలి. విజయవాడ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, విజయవాడ రూరల్ మండలం, పెనమలూరు మండలానికి చెందిన వారు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు.

# ఆకతాయితనానికి చెక్ పెట్టిన ఎమ్మెల్యే



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మహిళల భద్రతను కాపాడడమే లక్ష్యంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మరొకసారి తన కర్తవ్య నిబద్ధతను చాటుకున్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గములోని రెడ్డి కాలేజీలో గంజాయి సేవిస్తూ మహిళలు, యువతులను వేధిస్తున్న ఆకతాయిలపై ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఉక్కుపాదం మోపారు. ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే గళ్ళా మాధవికి స్థానిక మహిళలు ఫిర్యాదు చేశారు.

ఈ విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే గళ్ళా మాధవి తక్షణమే స్పందించి, స్వయంగా రెడ్డి కాలేజీ వద్దకు చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. అక్కడే పోలీసు ఉన్నతాధికారులను పిలిపించి మూడు మంది ఆకతాయిలను అదుపులోకి తీసుకునేలా చేసి, విద్యార్థులు, మహిళలు భయాందోళనలలో ఉండకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అదే విధంగా నగరంలో గంజాయి వ్యసనం పెరుగుతున్న దృష్ట్యా పెట్రోలింగ్‌ను మరింతగా పెంచాలని, గంజాయి అమ్మకందారులను గుర్తించి కట్టడి చేయాలని, ఇలాంటి సంఘటనలు మళ్లీ చోటు చేసుకోకుండా సమగ్ర పర్యవేక్షణ చేయాలని పోలీసు విభాగానికి ఆదేశాలు జారీ చేశారు.

"ప్రజల భద్రత, యువత భవిష్యత్తు నాశనం చేయబోయే గంజాయి మాఫియాను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించము. మహిళలు, యువతులు భయపడకుండా జీవించే వాతావరణాన్ని కల్పించడం నా ప్రథమ కర్తవ్యం" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గములో మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టి, ఆకతాయితనానికి చెక్ పెట్టే కఠిన చర్యలకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి చర్యలను స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## భారత్- కెనడా సంబంధాల్లో పురోగతి..



**ఢిల్లీ :** భారత్, కెనడాల మధ్య సంబంధాలు మళ్లీ పట్టాలెక్కుతున్నాయి. ఇరుదేశాలు పరస్పరం దౌత్యవేత్తలను పునర్నియమించాయి. కెనడాకు భారత హైకమిషనర్‌గా దినేశ్ కె.పట్నాయక్ నియమితులయ్యారు. ఆ దేశం సైతం భారత్‌లో తన హైకమిషనర్‌గా క్రిస్టోఫర్ కూటర్‌ను ప్రకటించింది. దినేశ్ కె.పట్నాయక్ 1990 బ్యాచ్ ఐఎఫ్ఎస్ అధికారి. ప్రస్తుతం స్పెయిన్‌లో భారత రాయబారిగా విధులు నిర్వహిస్తున్నారు. త్వరలోనే ఆయన కెనడాలో భారత హైకమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నట్లు విదేశాంగశాఖ ఓ ప్రకటనలో తెలిపింది.

జూన్‌లో కెనడా పర్యటనలో భాగంగా ఆ దేశ ప్రధాని మార్క్ కార్నీతో ప్రధాని మోదీ సమావేశమైన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా దౌత్యవేత్తల పునర్నియామకంపై ఇద్దరి మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. పరస్పర గౌరవం, చట్టాలకు కట్టుబడి ఉండటం సహా ఇరు దేశాల్లోని పౌరులు, వ్యాపారులకు సాధారణ సేవలు తిరిగి అందించే ఉద్దేశంతో దౌత్యవేత్తల పునర్నియామకానికి మోదీ, కార్నీలు అంగీకరించారని కెనడా ప్రధాని కార్యాలయం కూడా ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ మేరకు రెండు దేశాలూ చర్యలు తీసుకున్నాయి.

ట్రూడో అధికారంలో ఉన్న సమయంలో భారత్ - కెనడాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఖలిస్థానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో భారత్ హస్తం ఉందంటూ ఆయన ఆరోపించారు. దీంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ ఆరోపణలను భారత్ ఎప్పటికప్పుడు ఖండిస్తూ వచ్చింది. ఇరుదేశాలూ పరస్పరం దౌత్యవేత్తలను వెనక్కి పంపించాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆ దేశంలో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన మార్క్ కార్నీ.. న్యూదిల్లీతో సంబంధాల పునరుద్ధరణకు కృషి చేస్తున్నారు.

## జపాన్‌కు పయనమైన ప్రధాని

**ఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ రెండు దేశాల పర్యటన మొదలైంది. ఇందులో భాగంగా గురువారం రాత్రి ప్రధాని మోదీ దిల్లీ నుంచి జపాన్‌కు పయనమయ్యారు. ఆ దేశ ప్రధాని షిగేరు ఇషిబా ఆహ్వానం మేరకు ఈ నెల 29 నుంచి 30 వరకు అక్కడ పర్యటించనున్నారు. ఇందులో భాగంగా భారత్-జపాన్ 15వ వార్షిక సదస్సులో పాల్గొననున్నారు. ప్రధాని మోదీ చివరిసారి 2023 మేలో జపాన్‌లో పర్యటించారు. అనంతరం షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు చైనా చేరుకోనున్నారు.

"జపాన్- భారత్‌ల మధ్య సంబంధాలు గత 11 ఏళ్లుగా స్థిరమైన, గణనీయమైన పురోగతి సాధించాయి. ప్రస్తుత పర్యటనలో భాగంగా ఇరుదేశాల మధ్య ప్రత్యేక వ్యూహాత్మక, అంతర్జాతీయ భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించడంపై దృష్టిసారిస్తాను. మరోవైపు.. ఎస్‌సీవోలో భారత్ నిర్మాణాత్మక సభ్యదేశం. ఉమ్మడి సవాళ్లను పరిష్కరించేందుకు, ప్రాంతీయ సహకారాన్ని విస్తృతం చేసేందుకు ఎస్‌సీవో సభ్యదేశాలతో కలిసి పనిచేసేందుకు కట్టుబడి ఉంది.


## పదోన్నతుల కంటే ముందు రిక్వెస్ట్ బదిలీలకు ప్రాధాన్యం ఇవ్వాలి - ఇ.యు విజ్ఞప్తి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులు అమలు చేసే ముందు, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న రిక్వెస్ట్ బదిలీలను పరిగణలోకి తీసుకొని న్యాయం చేయాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ (ఇ.యు) డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఏపిపిటిడి కమిషనర్ & యం.డి ద్వారక తిరుమలరావు గారికి విజ్ఞప్తి పత్రాన్ని సమర్పించినట్లు రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

2020లో ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం అయిన తర్వాత ఆరు సంవత్సరాలుగా నిలిచిపోయిన పదోన్నతులు పునరుద్ధరించడానికి యం.డి కృషి చేయగా, గౌ. ముఖ్యమంత్రి ఆమోదం ఇచ్చారని నాయకులు గుర్తు చేశారు. ఈ క్రమంలో సుమారు మూడు వేల మంది ఉద్యోగులకు పదోన్నతులు లభించనున్నాయని పేర్కొన్నారు. అయితే, పదోన్నతులు ఇవ్వకముందు రిక్వెస్ట్ బదిలీలను పరిగణనలోకి తీసుకోవాలని, ఉద్యోగుల దీర్ఘకాలిక ఆకాంక్ష నెరవేరేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

అలాగే దశాబ్దాలుగా ఆర్టీసీలో ఉన్న ఆనవాయితీ ప్రకారం పర్సనల్, అకౌంట్స్ విభాగాల్లో సీనియర్ అసిస్టెంట్ల నుండి డిప్యూటీ సూపరింటెండెంట్ స్థాయి పదోన్నతులను ప్రమోషన్ కోటా ద్వారానే భర్తీ చేస్తున్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం కూడా అదే విధానం కొనసాగించాలని, ఖాళీలన్నీ అనుభవజ్ఞులైన సిబ్బందికే కేటాయించాలని ఇ.యు నేతలు స్పష్టం చేశారు.

## రైతులకు యూరియా సరఫరా కోఆపరేటివ్ సొసైటీల ద్వారానే చేయాలి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు అందవలసిన యూరియా పక్కదారి పట్టి బ్లాక్ మార్కెట్ అవుతున్న నేపథ్యంలో, ఇకపై ఎరువులను కోఆపరేటివ్ సొసైటీలు, డీసీఎంఎస్‌లు మరియు రైతు సేవా కేంద్రాల ద్వారా మాత్రమే సరఫరా చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన వ్యవసాయ శాఖ కమిషనర్ , డైరెక్టర్ ఢిల్లీ రావుకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఎరువులను ప్రైవేట్ డీలర్లకు ఇవ్వడం వలన కొంతమంది వ్యాపారులు నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారని, దీంతో రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం కేటాయించే యూరియా సహా అన్ని ఎరువులను పిఎసిఎస్ సొసైటీలు, డీసీఎంఎస్‌లు, రైతు సేవా కేంద్రాల ద్వారా మాత్రమే పంపిణీ చేయాలని ఆయన కోరారు. రైతు సంక్షేమం కోసం ఇది అత్యవసర చర్యగా ప్రభుత్వం తక్షణం నిర్ణయం తీసుకోవాలని కుమారస్వామి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.పాండురంగ విఠల్, రాష్ట్ర ప్రధాన కార్యాలయ ఇన్చార్జ్ వై.వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## సికింద్రాబాద్-తిరుపతి వందేభారత్..



**సికింద్రాబాద్:** వందేభారత్‌కు లభిస్తున్న ఆదరణ నేపథ్యంలో రైల్వే బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. సికింద్రాబాద్-తిరుపతి సహా ఏడు మార్గాల్లో నడిచే వందేభారత్ రైళ్ల కోచ్‌ల సంఖ్యను పెంచాలనినిర్ణయించింది. సికింద్రాబాద్-తిరుపతి, మంగళూరు సెంట్రల్- తిరువనంతపురం, చెన్నై ఎగ్మోర్-తిరునల్వేలి, మదురై-బెంగళూరు కంటోన్మెంట్, దేవ్‌గఢ్-వారణాసి, హవ్‌డా-రౌర్కెలా, ఇందౌర్-నాగ్‌పుర్ మధ్య నడిచే వందేభారత్ రైళ్లలో ఎక్కువ కోచ్‌లు అందుబాటులో ఉండనున్నాయి.ప్రస్తుతం మూడు మార్గాల్లో 16 కోచ్‌లు, నాలుగు రూట్‌లలో ఎనిమిది కోచ్‌ల వందేభారత్ రైళ్లు నడుస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. 16 కోచ్‌ల రైలును 20 కోచ్‌లతో, ఎనిమిది కోచ్‌ల రైళ్ల స్థానంలో 16 కోచ్‌లకు అప్‌గ్రేడ్ చేయనున్నట్లు రైల్వే బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ప్రజా సంబంధాలు) దిలీప్ కుమార్ వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో (జులై 31, 2025 నాటికి) వందేభారత్ రైళ్ల రద్దీ సమాచారాన్ని పరిగణనలోకి తీసుకొని వీటిని అందుబాటులో ఉంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

**సికింద్రాబాద్-తిరుపతి 20 కోచ్‌లు.. :** సికింద్రాబాద్-తిరుపతి సహా మంగళూరు సెంట్రల్- తిరువనంతపురం, చెన్నై ఎగ్మోర్-తిరునల్వేలి మార్గాల్లో ప్రస్తుతం 16 కోచ్‌ల వందేభారత్ నడుస్తుండగా.. దీనిని 20 కోచ్‌లకు పెంచనున్నారు. మిగతా నాలుగు మార్గాల్లో ఎనిమిది కోచ్‌ల రైళ్లు నడుస్తుండగా.. వాటి స్థానంలో 16 కోచ్‌లు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఏడు మార్గాల్లో కోచ్‌ల అప్‌గ్రేడ్‌తోపాటు మరిన్ని 20 కోచ్‌ల వందేభారత్ రైళ్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని రైల్వే అధికారులు పేర్కొన్నారు. కొత్తగా వచ్చే 16, 8 కోచ్‌ల రైళ్లను కొత్త మార్గాల్లో ఉపయోగిస్తామన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డు పంపిణీ



విజయవాడ, ఆగస్టు 28 (జర్నలిస్ట్ ఫైల్) :

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను రాణిగారితోట 18వ డివిజన్ లో మంగళవారం డివిజన్ అధ్యక్షులు వేముల దుర్గారావు ఆధ్వర్యంలో పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా వేముల దుర్గారావు మాట్లాడుతూ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుండి అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్నామని అన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డు పై గత ప్రభుత్వం జగన్ కు ఫోటోలు పిచ్చి పట్టి అతను బొమ్మ వేసుకున్నాడని

కానీ సీఎం చంద్రబాబు ప్రభుత్వం కేవలం ప్రభుత్వ సింబల్ తో కార్డు ఇవ్వటం చాలా సంతోషం అని అన్నారు. విజన్ ఉన్న నాయకుడు ఇలా చేస్తారని చెప్పారు. మేనిఫెస్టోలో పెట్టిన విధముగా సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం చంద్రబాబు ప్రభుత్వం మాత్రమే అని అన్నారు. సూపర్ సిక్స్ లో ఉచిత గ్యాస్ 3 బండలు, పేదవాడికి ఐదు రూపాయలకే అన్నం పెడుతున్నా అన్న క్యాంటీన్ లు, మెగా డీఎస్సీ, తల్లికి వందనం, అన్నదాత సుఖీ భవ, శ్రీ శక్తి, మహిళలకు ఉచిత సర్వీస్ ఈ లాగా మరో ఎన్నో పథకాలు ప్రజలకు అందుబాటులోకి వస్తున్నాయని అన్నారు. కూటమి, ప్రభుత్వంనికి ప్రజలు జేజేలు కొడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో శాంతియుత వాతావరణం నెలకొల్పి ఎన్నో కంపెనీలు పెట్టుబడు తెస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న నవ యువకుడు చంద్రబాబు అని అన్నారు. ప్రతి గ్రామంలో ప్రతి ఊరిలో ఈ ప్రభుత్వం ఇలాగే 20 సంవత్సరాలు ఉండాలని ప్రజల ఆకాంక్షిస్తున్నారని చెప్పారు. స్మార్ట్ కార్డు విధానాన్ని ప్రవేశపెట్టిన చంద్రబాబుకి పవన్ కళ్యాణ్ కి నారా లోకేష్ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పగడాల వెంకటేశ్వర్రెడ్డి మర్రి వెంకట సుబ్బయ్య, కోమీర శ్రీను, దేవల శ్రీను, అంబటికాశి, పప్పులబాబు, వెల్ఫేర్ సెక్రెటరీ, హారిక, ఆర్పీ, రాజేశ్వరి బేబీ పాల్గొన్నారు.

# రూ 11 లక్షల ఎల్. ఓ. సీ. పత్రాలు అందజేసిన మంత్రి కొలుసు పార్థసారథి



ఆగిరిపల్లి, ఆగస్టు 28 (జర్నలిస్ట్ ఫైల్) :

రాష్ట్ర ప్రజల నాణ్యమైన వైద్యం కోసరం ప్రభుత్వం వేల కోట్లు కేటాయించిందని, డబ్బులు లేక మెరుగైన వైద్యానికి నోచుకోక అపత్కాలంలో ఉన్న నిరు పేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి, అండగా నిలుస్తుందని రాష్ట్ర గృహనిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు నియోజకవర్గంలో నాలుగు కుటుంబాలకు గాను 11లక్షల ఎల్. ఓ. సీ. పత్రాలను బాధిత కుటుంబాలకు అందించారు. ముసునూరు మండలం, చింతలవల్లి గ్రామాలకు చెందిన,ఎన్, కమలా కుమారి కుటుంబ సభ్యులు తాము ఆర్థిక ఇబ్బందులు వలన మెరుగైన వైద్యం చేయించుకోలేక బాధపడుతున్నామని చెప్పారు. ఆదుకోవాలని మంత్రిని కోరగా తక్షణమే స్పందించి, సుమారు, రూ. 1.50లక్షల ఎల్. ఓ. సీ. పత్రాలు అందజేసారు. ఆగిరిపల్లి మండలం వడ్లమాను గ్రామానికి చెందిన పి.లక్ష్మీకి,రూ 1.50లక్షల నూజివీడు మండలం ముక్కోళ్లపాడు గ్రామానికి చెందిన పి, సుందరమ్మకు,రూ. 05లక్షల, పల్లెర్లమూడి గ్రామానికి చెందిన,వి, కుమారి కుటుంబానికి,రూ. 03లక్షల ఎల్, ఓ. సి. పత్రాలను మంత్రి అందజేసారు. గతంలో వైద్యం చేయించుకున్న వారు కూడా వైద్యం చేయించుకున్న బిల్లులను మా కార్యాలయంలో అందజేస్తే ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం వెంటనే అందజేస్తానన్నారు. మెరుగైన వైద్యానికి కూటమి ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తుందని ప్రజలంతా దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని ప్రజలంతా మెరుగైన వైద్యాన్ని సద్వినియోగం చెసుకోవలన్నారు. రాష్ట్ర మంత్రి పార్థసారథికి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకుడిని పూజిద్దాం

## పర్యావరణానికి మేలు చేద్దాం



ఆగిరిపల్లి, ఆగస్టు 28 (జర్నలిస్ట్ ఫైల్) :

ఆగిరిపల్లి మండలం ఈదర హై స్కూల్ ప్లస్ పాఠశాల నుండి విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, అందరూ జరగబోయే వినాయక చవితి సందర్భంగా పర్యావరణానికి మేలు చేసేటటువంటి మట్టి వినాయకుడి విగ్రహా లకు పూజల జరపాలని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్తో చేసిన రసాయన రంగులు వాడిన విగ్రహాల వలన పర్యావరణానికి హాని కలుగుతుందని తెలుపుతూ ఈదర గ్రామం లోని వీధులలో ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీలో పాఠశాల ప్రధా నోపాధ్యాయిని సంధి పాము శారద, ఉపాధ్యాయులు,మరియు గ్రామ సర్పంచ్ అనిత, ఏసు పాదం, తల్లితండ్రుల కమిటీచైర్మన్ కంచర్లఅంజయ్య,కమిటీసభ్యులు పాల్గొన్నారు.

# ఆశ వర్కర్స్ కి వేతనాల పెంపు హామీని నిలబెట్టుకోవాలి

## ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ ధనలక్ష్మి




మైలవరం, ఆగస్టు 28 (జర్నలిస్ట్ ఫైల్) :

మంగళవారం మైలవరం మారుతి కళ్యాణ మండపంలో ఆశా వర్కర్స్ యూనియన్ ఎన్టీఆర్ జిల్లా ఆరవ మహాసభలు ఘనంగా జరిగాయి. ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ ) సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ ధనలక్ష్మి మాట్లాడుతూ గ్రామీణ, పటం ప్రాంతాల్లో పేద గర్భిణీ బాలింతల కు పసిపిల్లలకు నిరుపేద ప్రజలకు ఆరోగ్య సేవ పరమైన సేవలందించడంలో మాతా శిశు సంరక్షణలో ఆశా వర్కర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని కరోనా టైములో ఫ్రంట్ లైన్ వారియర్స్ గా ప్రపంచ ఆరోగ్య సంస్థ చేత ప్రశంసించబడ్డారు , అంతేకాకుండా టీబీ లెప్రసీ ఎయిడ్స్ వంటి జబ్బులకు మరియు ఇతర సీజనల్ వ్యాధులకు సేవలు అందించడమే కాకుండా రకరకాల సర్వేల పేరుతో ప్రతిరోజు ఇంటింటికి తిరుగుతూ ఆశ వర్కర్లు సంబంధం లేని పనులతో పని భారాన్ని ఎదుర్కొంటున్నారని విపరీతమైన పనివారం పోయడం వలన బీపీ షుగర్ హార్ట్ ట్యాక్ వంటి అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని అన్నారు, ఆశా వర్కర్లతో గొడ్డు చాకిరి చేయిస్తున్న ప్రభుత్వాలు జీతాలు పెంచి ఆరు సంవత్సరాలు అవుతుందని ఈ కాలంలో నిత్యవసర సరుకులు ధరలు విద్యా వైద్యం ఖర్చులు కరెంటు బిల్లులు రకరకాల పనుల విపరీతంగా పెరగడం వలన ఇప్పుడు ప్రస్తుతం ఉన్న ఆదాయం కుటుంబ అవసరాలకు చాలక ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని అన్నారు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆశ వర్కర్లకు కనీస వేతనం చెల్లిస్తామని తన ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టారు కానీ అధికారంలోకి వచ్చి కూటమి ప్రభుత్వం 14 నెలలు గడుస్తున్నా నేటికీ ఆశ వర్కర్ల వేతనాలపై మాట్లాడటం లేదు, ఈ నేపద్యంలో ఆశా వర్కర్స్ యూనియన్ ఆరవ జిల్లా మహాసభ ఏకగ్రీవంగా కూటమి ప్రభుత్వం తక్షణమే వేతనాలు పెంచాలని తీర్మానం చేసింది, రెండో తీర్మానం ధాన్యమైన ఫోన్స్ ఇవ్వాలి ఆశా వర్కర్లకు సెలవులు ఇవ్వాలి రాతపూర్వకమైన హామీ ఇచ్చిన ప్రకారం దహన సంస్కారాల ఖర్చులు ఇవ్వాలి ఎన్ హెచ్ ఎం నిధుల ప్రకారం ఆశ నియమకాలను చేపట్టాలి ఖాళీ పోస్టులు తక్షణమే భర్తీ చేయాలి అని ఈ మహాసభ డిమాండ్ చేసింది, ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ సి హెచ్ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు, ఏ వెంకటేశ్వరరావు, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏ కమల, పి జ్యోతి, సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ సుధాకర్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఆశ వర్కర్స్ యూనియన్ నూతన జిల్లా కమిటీ

జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏ కమల,జిల్లా అధ్యక్షురాలుగా పి జ్యోతి, జిల్లా కోశాధికారి పి శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షులుగా ఎస్ దుర్గ లక్ష్మి, ఎం తిరుమల దేవి, జి నాగేశ్వరి, పి చంద్రకళ, సహాయ కార్యదర్శిగా దేవి కుమారి, ఈ కమల, డి సుధారాణి, ఆరవ జిల్లా మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# మదర్ థెరెసా జీవితం మనందరికీ ప్రేరణ



గన్నవరం, ఆగస్టు 28 (జర్నలిస్ట్ ఫైల్) :

కృష్ణా జిల్లా, గన్నవరం మండలం, మదర్ తెరిసా జీవితం ప్రపంచ మానవాళికి ఒక ప్రేరణ కావాలని ముస్తాబాద్ నవభారత్ హై స్కూల్ ప్రిన్సిపల్ షేక్ ఇమామ్ ఈరోజు పాఠశాలలో నిర్వహించిన మదర్ తెరిసా జయంతి కార్యక్రమములో పాల్గొంటూ అన్నారు. ముందుగా మదర్ తెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదర్ తెరిసా 1910 వ సంవత్సరం అక్టోబర్ 26వ తేదీన జన్మించారని,పేదవారికి, అనాథలకు, రోగులకు సహాయం చేయడం ఆమె జీవిత ధ్యేయమని, ఆమె భారతదేశానికి వచ్చి కలకత్తాలో సేవా కార్యక్రమాలు ప్రారంభించారని మిషనరీస్ ఆఫ్ చారిటీ అనే సేవా సంస్థను స్థాపించి ప్రేమ, కరుణ, సహనంతో మానవత్వానికి మార్గదర్శకులరాలయ్యారని పేర్కొన్నారు. నిర్మల్ హృదయ్ మరియు శిశు భవన్ వంటి సంస్థలను స్థాపించి ఎందరో అనాథలను అభాగ్యులను అక్కున చేర్చుకోవడం జరిగింది. 1997లో ఆమె పరమపదించారు కానీ ఆమె సేవలు ఎప్పటికీ మరవలేవు. ఆమెకు నోబెల్ శాంతి బహుమతి సహా అనేక గౌరవాలు ఆమెను వరించాయని అందుకే ఆమె జీవితం అందరికీ ఆదర్శప్రాయం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఘనంగా మదర్ థేరిసా జయంతి

## నివాళులర్పించిన మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కోయసుధ



మైలవరం, ఆగస్టు 28 (జర్నలిస్ట్ ఫైల్) :

మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు అధ్యక్షతన మైలవరం సెంటరులోని మదర్ తెరిసా విగ్రహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించి,కేక్ కట్ చేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుధ మాట్లాడుతూ విశ్వమాత సమానత్వమే మన సరిహద్దు అంటూ నిజ జీవితంలో ఆచరించి చూపిన ఆదర్శ భారతరత్నం మదర్ థేరిస్సాయని, దిక్కులేని అనాథలను దివ్యాఅంగులను అనాథ వృద్ధులను అక్కున చేర్చుకుని వారి జీవితాలకు భరోసాను కల్పించిన మానవతావాది మదర్ థేరిస్సాయని మానవసేవే మాధవసేవ ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అంటూ కష్టజీవుల కడగండ్లను కడతేర్చిన కరుణామయి మదర్ థేరిస్సాఅని అమె అన్నారు. ఈ కార్యక్రమం లో వంగూరు రమేష్ బాబు,సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాల అధ్యాపకునికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

మైలవరం, ఆగస్టు 28 (జర్నలిస్ట్ ఫైల్) :



మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకునుగా పనిచేస్తున్న డాక్టర్ మెండా దేవానంద్ కుమార్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కు ఎంపికయ్యారు. కేంద్ర విద్యా శాఖ భారత ప్రభుత్వం నుండి ఈ మేరకు ఆయన లేఖ అందుకున్నారు. సెప్టెంబర్ 5వ తేదీన భారత రాష్ట్రపతి చేతుల మీదుగా న్యూఢిల్లీలో ఈ జాతీయ అవార్డును స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా కళాశాల నిర్మాణ దాత డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి మరియు కళాశాల అధ్యాపక సిబ్బంది డాక్టర్. దేవానంద్ కి అభినందనలు తెలిపారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు దేవానంద్ ని అభినందనలతో ముంచెత్తారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ




మైలవరం, ఆగస్టు 28 (జర్నలిస్ట్ ఫైల్) :

ఎన్టీఆర్ జిల్లా మైలవరం, లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం మైలవరం, వెల్వడం, పొందుగల గ్రామాలలో వినాయకుని మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సెకండ్ వైస్ జిల్లా గవర్నర్ లయన్ చెన్నారెడ్డి శ్రీనివాస్ రెడ్డిగారు, జీఎస్టీ కోఆర్డినేటర్ లయన్ కంచర్ల ముత్య ప్రసాద్ , ప్రోగ్రాం కమిటీ చైర్మన్ లయన్ ఎస్ వి ఎన్ నివృత రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మట్టి వినాయకులనే పూజించాలన్నారు. లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది మట్టి వినాయకులను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా పడి పంటలు బాగా పండాలని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మైలవరం పిఎస్టీలు చనుమోలు నాగభూషణం, శీలం రామిరెడ్డి,, చలువాదిహరీష్ కుమార్ గుప్తా, ప్రోగ్రాం కోఆర్డినేటర్ జాస్తి వెంకటేశ్వరరావు, జెడ్ సి తిరుమల శెట్టి శ్రీధర్, సీనియర్ లైన్ మెంబర్లు డాక్టర్ బాలగోపాల్ రెడ్డి, లక్ష్మణరావు, లేళ్ల ఏడుకొండలు, ఆలమూరు చంద్రం, పులిపాటి శ్రీనివాసరావు, లక్ష్మీ గణేష్, సంగు రాంబాబు, ప్రసాద్ మాస్టారు, నాగ ప్రసాద్, ఆర్ శివకృష్ణ,రాంబాబు పాల్గొన్నారు.

# పండగలు, సంప్రదాయాల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతను కలిగి ఉండాలి

- ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు
- యల్.బి.ఆర్.సి.ఈ ఎన్ .ఎస్.ఎస్ & ప్రకృతి క్లబ్ ఆధ్వర్యంలో మట్టి గణపతులు, మొక్కల పంపిణి



మైలవరం, ఆగస్టు 28 (జర్నలిస్ట్ ఫైల్) :

స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్. యూనిట్, ప్రకృతి క్లబ్ ఆఫ్ ఎల్.బి.ఆర్.సి.ఇ., మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మైలవరం సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో వినాయకచవితి సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు మరియు వైస్ ప్రిన్సిపాల్ డా. బి.రమేష్ రెడ్డి మట్టి గణపతి విగ్రహాలను , 500 మొక్కలను ఉచితంగా అధ్యాపక , అధ్యాపకేతర సిబ్బందికి మరియు విద్యార్థిని విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు మట్టి గణపతి విగ్రహాలనే వాడాలని అవగాహన కల్పించారు. పండగలు, సంప్రదాయాల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతను కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి పండుగ వెనుక ఒక మహోన్నత లక్ష్యం దాగి ఉంటుందని, ప్రకృతిలో మమేకమవుతూ నేల నీరు, చెట్టు, పుట్ట తదితర ప్రకృతి శక్తులన్నింటినీ ఆరాధించడం మన సంస్కృతిలో భాగంగా కొనసాగుతుందన్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో కాలుష్యానికి కారణమయ్యే వాటిని పక్కన పెట్టి మట్టి విగ్రహాలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ గణపతి విగ్రహాలను మనీషా డెంటల్ కేర్ , విజయవాడ మరియు మథర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ వారు అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ .ఎస్.ఎస్.ప్రోగ్రాం ఆఫీసర్ డా.బి.శివ హరి ప్రసాద్ .ఉమా మహేశ్వర రెడ్డి , ప్రకృతి క్లబ్ కో-ఆర్డినేటర్లు డా. షహీదా నిలోఫర్ , డా.వి. భాగ్య లక్ష్మి , ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మైలవరం సబ్ బ్రాంచ్ సెక్రటరీ & ట్రెజరర్ గూడూరు నాగి రెడ్డి, ప్రకృతి క్లబ్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు భారీగా కోత!

## త్వరలో కొత్త మార్గదర్శకాలు

**హైదరాబాద్, ఆగస్టు 28 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ విదార్థులకు అమలు చేస్తున్న ఫీ రియింబర్స్ మెంట్‌కు భారీగా కోత పడనుంది. దీనికి సంబంధించి మార్గదర్శకాలను మరింత కఠిన తరం చేయాలని సంక్షేమ శాఖలు నిర్ణయించాయి. రాష్ట్రం మొత్తం మీద ప్రతీ ఏటా 12.51 లక్షల మంది ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పొందుతున్నారు.

ఇందులో 5 లక్షల మంది కొత్త వారు ఉండగా, అన్ని కోర్సులకు కలిపి సంవత్సరానికి 2,350 కోట్ల రూపాయలు చొప్పున ప్రభుత్వానికి ఖర్చవుతోంది. ఇప్పటి వరకూ సాంఘిక, గిరిజన సంక్షేమ విద్యార్థులకు ఎంత ర్యాంకు వచ్చినా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తున్నారు. వెనుకబడిన తరగతులకు మాత్రం 10 వేల లోపు ర్యాంకు వస్తేనే ఇంజనీరింగ్‌లో మొత్తం చెల్లిస్తు, ఆపై ర్యాంకులకు 35 వేల రూపాయలను మాత్రమే ఇస్తున్నారు.

మరోపక్క రాష్ట్ర వ్యాప్తంగా ఫీ రియింబర్స్ మెంట్ భారం భారీగా పెరిగి వాటి నిమిత్తం బకాయిలు ఇప్పటికే దాదాపు 8.10 కోట్ల రూపాయల మేరకు పెరుగు పోయాయి. ఈ నేపథ్యంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అర్హతల్లో మార్పులు చేసేందుకు సర్కార్ సైతం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

కొత్త మార్గదర్శకాల ప్రకారం దాదాపు 35 శాతం మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్‌కు అర్హత కోల్పోయే అవకాశం ఉన్నట్లు అంచనా. ప్రధానంగా డిగ్రీ, ఇంజనీరింగ్ తదితర సాధారణ, సాంకేతిక కోర్సులకు గాను ఫీజు రీయింబర్స్ మెంట్ అర్హత విషయంలో కొత్తగా మార్గదర్శకాలను రూపొందించే పనిలో అధికారులు ఉన్నారు.

ముఖ్యంగా ఒక సంవత్సరంలో 50 శాతం సబ్జెక్టులు పాస్ కావడంతో పాటు, 75 శాతం హాజరు ఉండాలనే నిబంధనలను కొత్తగా అమలు చేయనున్నట్లు సమాచారం. అంతేకాకుండా వివిధ సబ్జెక్టుల్లో నిర్దిష్ట మార్కులను ప్రామాణికంగా తీసుకోనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ అధికారవర్గాల ద్వారా తెలియవచ్చింది. డిగ్రీ కోర్సుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ లోపం ఎక్కువగా ఉన్న దృష్ట్యా అటువంటి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయకుండా అనర్హులుగా చేసే ఆలోచన చేస్తున్నారు. సాంకేతిక కోర్సులకు సంబంధించిన ప్రధాన సబ్జెక్టులో కనీసం 60 శాతం మార్కులు తెచ్చుకున్న వారికే ఈ పథకాని వర్తింప చేయనున్నారు.



ఆచార్య రాంరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్య సంజీవ్ సోనావాణే, ఆచార్య వర్సిటీ విసి ఘంటా చక్రపాణి తదితరులు.

## విశ్వవిద్యాలయాల్లో డిజిటల్ ఆవిష్కరణలదే భవిష్యత్తు

### ఘనంగా అంబేద్కర్ వర్సిటీ 44వ వ్యవస్థాపక వేడుకలు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఆగస్టు 28 (జర్నలిస్ట్ ఫైల్) :** మారుతున్న ఆధునిక సవాళ్లను అధిగమిస్తూ సరికొత్త డిజిటల్ ఆవిష్కరణలతో దూరవిద్యావిధానం అభివృద్ధిలో పయనిస్తుందని యశ్వంతరావు చవాన్ మహారాష్ట్ర విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య సంజీవ్ సోనావాణే అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ 44వ వ్యవస్థాపక వేడుకలను మంగళ వారం విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. 'సార్వత్రిక దూర విద్యలో కృత్రిమ మేధ ఆధారిత పరివర్తన పేరుతో నిర్వహించిన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. సార్వత్రిక దూరవిద్య విధానం ఒక కొత్త యుగంలోకి ప్రవేశించిందని, దీనిలో ఆర్టిఫిషియల్ ఇంటి లిజెన్స్ఎంతో ఆవశ్యకత సంతరించుకొందన్నారు. అంబేద్కర్ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి ఇంటికి దూరవిద్యను అందించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. త్వరలో విశ్వవిద్యాలయంలో డిజిటల్ రిసోర్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఇక్కడ మైక్రో క్రెడెన్షియల్ కోర్సులను ప్రారంభించారు. జాతీయ సెమినార్ పరిశోధన పత్రాలను ఆవిష్కరించారు. ఘంటా చక్రపాణి సేకరించిన 1,100ల పుస్తకాలను వర్సిటీ లైబ్రరీకి అందించారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో పనిచేసే అనువాదిని సంస్థతో జరిగిన అవగాహన ఒప్పందం మేరకు ఆయా ఒప్పందపత్రాలను సంస్థ సిఇఒ చంద్రశేఖర్ చేతుల మీదుగా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ విజయకృష్ణారెడ్డి మార్చుకున్నారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, డీన్లు, బోధన, బోధ నేతర సిబ్బంది, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వ్యవస్థాపకుడు ఆచార్య జి.రాంరెడ్డి చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.

## రాష్ట్రంలో పాలన పక్కకుపెట్టి ఢిల్లీ టూర్లు, విదేశాలకు వెళ్లిన ఘనత రేవంత్‌రెడ్డిదే

### బిజెపి అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జి ఎన్.వి.సుభాష్

**హైదరాబాద్, ఆగస్టు 28(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో గత 20 నెలల పాలనలో ప్రజాసమస్యలను పట్టించుకోకుండా 50సార్లు ఢిల్లీతోపాటు బీహార్, కలకత్తా, విదేశాల టూర్లకు వెళ్లిన ఘనత కేవలం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందని బిజెపి అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి.సుభాష్ అన్నారు. మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1978-83 మధ్య ఐదు సంవత్సరాల్లో నలుగురు ముఖ్యమంత్రులు మారినా, ఒక ముఖ్యమంత్రి మాత్రమే 75 సార్లు ఢిల్లీకి వెళ్లాడు. కానీ రేవంత్ రెడ్డి కేవలం 20 నెలల్లోనే దాదాపు ఆ రికార్డుకు దగ్గరయ్యారన్నారు. ప్రజలు అడుగుతున్నారు... మేము ఎన్నుకున్న ముఖ్యమంత్రి ఎక్కడ? ఎప్పుడూ ఢిల్లీలోనా, బీహార్‌లోనా, లేదంటే విదేశాల్లోనా? అంటూ ప్రశ్నిస్తున్నారని అన్నారు. ఎప్పుడైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలవాలనుకుంటే - వారు హైదరాబాద్‌లో ఉండరు, సెక్రటేరియట్‌కి రావడం లేదు, ప్రజలకు అసలు అందుబాటులో ఉండడం లేదు,

ఎప్పుడూ ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి తిరుగుతూనే ఉన్నారు అన్నారు. అందుకే ఆయనకు సరిపోయే బిరుదు ఒకటే -ది బెస్ట్ హాపింగ్ చీఫ్ మినిస్టర్ ఆఫ్ ది కంట్రీ, ఇటీవల సోనియా గాంధీ రేవంత్ రెడ్డికి బాస్కర్ అవార్డు ఇచ్చినట్లే, ఇకపై ఈ హాపింగ్ చీఫ్ మినిస్టర్ అవార్డు కూడా ఆయనకే దక్కుతుందన్నారు. గ్యారెంటీలు అని చెప్పి, హామీలు అని చెప్పి, కొత్త కొత్త స్కీమ్స్ తెస్తామని పదే పదే చెబుతూ ప్రజలను మోసం చేశారన్నారు. ఇటీవల మా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు వివిధ జిల్లాల పర్యటనలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రజలు పెద్ద సంఖ్యలో ఆయన వద్దకు వచ్చి పిటిషన్లు, మెమోరాండాలు ఇచ్చారని, ముఖ్యమంత్రికి కనీసం ఒకసారి చెప్పండి.. మా సమస్యలు విని పరిష్కరించేలా హితవు పలకండి అని ప్రజలు వేడుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయన్నారు. సిఎం రేవంత్ రెడ్డి హోం మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నా, గత 20 నెలల్లో తెలంగాణ రాష్ట్రంలో అనేక ఘోరాలు జరిగాయి. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సంఘటనలు పెరిగాయని, మహిళలపై అత్యాచారాలు భయంకరంగా పెరిగాయన్నారు. ప్రజల సమస్యలను పక్కన పెట్టి, కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చే నిధులను సక్రమంగా వినియోగించి ఉంటే, తెలంగాణ రాష్ట్రం ఈ రోజుకి మరింత అభివృద్ధి చెంది ఉండేదన్నారు. పక్క రాష్ట్రాలతో పోటీపడే స్థాయిలో నిలిచేది. కానీ ఆ అవకాశాన్ని వినియోగించుకోలేక, ప్రజలను మోసం చేశారన్నారు.

## 29 నుంచి ఎడ్‌సెట్ సెకండ్‌ఫేజ్ కౌన్సెలింగ్

### సెప్టెంబరు 11న సీట్ల కేటాయింపు

**హైదరాబాద్, ఆగస్టు 28(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు బీఈడీ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్ సెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా సెకండ్ ఫేజ్ కౌన్సె లింగ్ ఈ నెల 29 నుంచి ప్రారంభించనున్నారు. ఈ నెల 29 నుంచి సెప్టెంబర్ 2 వరకు ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకొని, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి అవకాశం కల్పించినట్లు అడ్మిషన్ల కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండు రంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థుల లిస్టును సెప్టెంబర్ 4న ప్రకటించనున్నారు. అర్హులైన వారు సెప్టెంబర్ 5, 6 తేదిల్లో వెబ్ ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. సెప్టెంబర్ 7న వెబ్ ఆప్షన్లకి ఎడిట్ సౌకర్యం కల్పించారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి సెప్టెంబర్ 11న సీట్ల కేటాయింపు చేస్తారు. సీట్లు పొందిన వారు సెప్టెంబర్ 12 నుంచి 16 వరకు ఆయా కాలేజీల్లో చేరాలని కన్వీనర్ సూచించారు. రాష్ట్రంలో 14,295 కన్వీనర్ కోటా సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటి కోసం మొదటి విడతలో 17,151 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారిలో 9955 మందికి సీట్ల కేటాయింపు చేశారు. ఈ నెల 10న సీట్ల కేటాయింపు చేయగా.. వారు కాలేజీల్లో చేరడానికి విద్యార్థులకు ఈ నెల 20 వరకు అవకాశం కల్పించిన విషయం తెలిసిందే.

## పెండింగ్‌లోని ఎస్టీ ప్రత్యేక నిధుల వినియోగానికి చర్యలు

### ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

**హైదరాబాద్, ఆగస్టు 28 (జర్నలిస్ట్ ఫైల్) :** గత ప్రభుత్వం హయాం నుంచి పెండింగ్‌లో ఉన్న ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధులు వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాల్సి ఉందని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని గిరిజన సంక్షేమ శాఖలో మంగళవారం జరిగిన సమా వేశంలో మాట్లాడుతూ ఎస్టీల సంక్షేమం కోసం ఆయా సంవత్సరాలలోనే ఖర్చు కాకుండా మిగిలిపోతున్నాయని చెప్పారు. వాటిని అదే యేడాది సకాలంలో ఖర్చు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామ న్నారు. అలాగే ఎస్టీ ఉద్యోగులకు ఉద్యోగాలలో ప్రమోషన్లు సకాలంలో వచ్చేలా రోస్టర్ విధానాన్ని పటిష్టం చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వ ఆశించిన విధంగా జరిగేలా చూడాలన్నారు. విద్యార్థుల డైట్,కాస్మెటిక్ ఛార్జీలు వెంటనే విడుదలయ్యేలా చర్యలు తీసుకోవడం పట్ల ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ దేశంలో అన్ని కార్పొరేషన్లకొంత నిర్వీర్యమైనాయని, ఈ విషయంలో ప్రభుత్వ సహకారం ఆయా కార్పొరేషన్లకు అవసరమన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రులతో చర్చించిఇప్పటికే కొన్ని విధాన పరమైన నిర్ణయాలను తీసుకోగలి గామన్నారు. ఇక మీదట ఎస్సీ ఎస్టీ కమీషన్ ఇచ్చే సలహాలు, సూచనలు పాటిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ ఎస్టీ కమీషన్ సభ్యులు నీలాదేవి, రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, శంకర్, రేణికుంట్ల ప్రవీణ్‌తో పాటు, గిరిజన సంక్షేమ కార్యదర్శి వర్షిణి, అదనపు సంచాలకులు విట్టా సర్వేశ్వర్‌రెడ్డి, ఎస్టీ గురుకుల కార్యదర్శి సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మూడు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాలి

### ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 28 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో యూరియా కొరత లేదని, రైతులు ఎటు వంటి ఆందోళన చెందవద్దని ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. యూరియా విక్రయించే పి. ఏ.సి.ఎస్., ప్రైవేట్ ఎరువుల డీలర్ షాపుల వద్ద ప్రభుత్వ అధికారిని నియమించి పర్యవేక్షణ చేసేలా బాధ్యతలు అప్ప గించాలని ఆదేశించారు. మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎం.ఎల్.సి.లు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ లు, ఎస్.పి.లు, వ్యవసాయ అధికారులు, సహకార శాఖ అధికారులతో యూరియా సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వ్యవసాయ సీజన్ పూర్తి అయ్యే వరకు యూరియా సరఫరాపై జిల్లా కలెక్టర్ లు,ఎస్.పి .లు ప్రత్యేక దృష్టి సారించి నిశితంగా పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యూరియా సరఫరాలో ఎటువంటి అవకతవకలు జరిగినా, దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించిన అటువంటి ఎరువుల డీలర్ లపై, నకిలీ విత్తనాలు విక్రయించిన, అధిక రేటుకు విక్రయించిన వారిపై కేసులు నమోదు చేసి శిక్షలు పడేలా చర్యలు తీసుకో వాలని జిల్లా కలెక్టర్‌లు, ఎస్.పి.లను ఆయన ఆదేశించారు. యూరియా పంపిణీ జరగడం లేదని ఆరోపణలు వస్తున్నా యని వాస్తవంగా కేంద్రం నుండి రావాల్సిన 9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉండగా ఇప్పటివరకు 5.72 లక్షల మెట్రిక్‌టన్నుల యూరియా వచ్చిందని ఇంకా సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నులు రావాల్సి ఉందని తెలిపారు. పూర్తిగా యూరియా వస్తే రైతులకు ఎటువంటి ఇబ్బంది రాదని తెలిపారు. రైతులు ఇబ్బంది పడకూడదని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, కేంద్రంతో, కేంద్ర మంత్రులతో మాట్లాడి వెంటనే యూరియా రాష్ట్రానికి వచ్చేలా అన్ని విధాలుగా చర్యలు తీసుకున్నారని తెలిపారు. సమావేశంలో ఎం.ఎల్.సి కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి, శాసన సభ్యులు జి.మధుసూదన్ రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, చిక్కుడు వంశీ కృష్ణ, కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, యెన్నం శ్రీనివాసరెడ్డి, చిట్టెం పర్ణికా రెడ్డి, తూడి మేఘా రెడ్డి, డి.సి.సి. బి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

## సాంకేతిక సమస్యల్లో రామగుండం ఎరువుల ప్లాంట్

### యూరియా ఉత్పత్తికి బ్రేక్

**హైదరాబాద్, ఆగస్టు 28 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రానికి అత్యధికంగా యూరియాను సరఫరా చేసే రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్సీఎల్) ప్లాంట్ సాంకేతిక సమస్యల్లో కొట్టుమిట్టాడుతోంది. తరచూ ప్లాంట్‌లో సాంకేతిక సమస్యలు ఏర్పడి యూరియా ఉత్పత్తికి తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి. దీని ఫలితంగా రాష్ట్రానికి సకాలంలో, వాటా ప్రకారం రావాల్సిన యూరియా రాక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ ప్లాంట్ 2021 మార్చి 22న యూరియా ఉత్పత్తిని ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు 20 సార్లు సాంకేతిక సమస్యలు ఏర్పడి నిలిచిపోయింది. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు రెండు సార్లు ప్లాంట్ షట్డౌన్ కాగా, తాజాగా హెచ్టీఆర్ మెషినరీలో సాంకేతిక లోపం కారణంగా ఉత్పత్తి మళ్లీ నిలిచిపోయింది. దీని ప్రభావం యూరియా ఉత్పత్తిపై చూపుతోంది. రామగుండం యూరియా ప్లాంట్లో సాంకేతిక సమస్యలు తలెత్తిన సందర్భంలో పైప్లైన్లలో అమోనియా లీక్ అవుతోంది. దీంతో ప్లాంట్ మొత్తాన్ని రోజుల తరబడి షట్ డౌన్ చేయాల్సి వస్తోంది. మే 8న ప్లాంట్లో ఏర్పడిన లీకేజీ సమస్య కారణంగా జూన్ 15 వరకు 39 రోజులు ప్లాంట్ను షట్డౌన్ చేశారు. మళ్లీ జులై 16న సమస్య ఏర్పడడంతో ఆ రోజు నుంచి ఆగస్ట్ 4 వరకు 20 రోజులు ప్లాంట్ షట్డౌన్ అయింది. అలాగే హీట్ ట్రాన్స్ఫర్మింగ్ రీఫార్మర్ (హెచ్టీఆర్) లో ఈ నెల 14న టెక్నికల్ ఇష్యూతో లీకేజీ ఏర్పడడంతో ప్లాంట్ మరోసారి షట్ డౌన్ అయింది. ఈ మెషీన్లో సాంకేతిక లోపం ఏర్పడితే దానికదే ఆటోమేటిక్గా ట్రిప్ అవుతుంది. ఈ సమస్య ప్లాంట్‌లో నిత్యకృత్యంగా మారింది. ప్రస్తుత 2025-26 సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 4 లక్షల టన్నుల యూరియా ఉత్ప త్తిని లక్ష్యంగా పెట్టుకోగా, 2.71 లక్షల టన్నుల ఉ త్పత్తి మాత్రమే చేయగలిగారు. ఈ నెలలో 65 వేల టన్నుల యూరియా ఉత్పత్తిచేసి రవాణా చే యాలని నిర్ణయించుకున్నా, కేవలం 24వేల టన్నుల యూరియాను మాత్రమే సరఫరా చేసింది.

## పెన్షనర్లను మోసం చేసిన ముఖ్యమంత్రి

### ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు పెంచాలి

### 9న హైదరాబాద్‌లో పెన్షన్‌దారుల మహాగర్జన

### ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



మంగళవారం జడ్చర్లలో నియోజకవర్గ సన్నాహక సదస్సు మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 28(జర్నలిస్ట్ ఫైల్):** వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6 వేలు పెన్షన్ ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవ్వకుండా మోసం చేశాడని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆరోపించారు. దివ్యాంగుల పెన్షన్ రూ.6 వేలకు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, అన్ని రకాల చేయూత పెన్షన్లు రూ.4 వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి, చేయూత పెన్షన్‌దారుల ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో నియోజకవర్గ సన్నాహక సదస్సు నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంద కృష్ణ మాదిగ హాజరై మాట్లాడారు. ఈ నెల ఓటు వేయండి, వచ్చే నెల నుండే పెన్షన్ తీసుకోండని మాట్లాడిన రేవంత్ రెడ్డి ఓటు వేశాక ముఖ్యమంత్రి అయి పెన్షన్ దారులందర్నీ ఘోరంగా మోసం చేశాడని విమర్శించాడు. రేవంత్‌రెడ్డి చేసిన మోసం గురించి ప్రతిపక్షాలు కూడా మాట్లాడకుండా చేయూత పెన్షన్‌దారు లకు అన్యాయం చేస్తున్నాయన్నారు. 50లక్షల మంది పెన్షన్ దారుల పక్షాన దివ్యాంగుల హక్కుల పోరాట సమితి మాదిగ రిజర్వే షన్ పోరాట సమితి పోరాటం చేస్తుందన్నారు. పెన్షన్లు పెంచకపోతే చలో హైదరాబాద్ సెప్టెంబర్ 9న పెరేడ్‌గ్రౌండ్‌లో లక్ష లాది మందితో మహాగర్జన నిర్వహిస్తు న్నామన్నారు. కార్యక్రమం లో వికలాంగ హక్కుల పోరాట సమితి జాతీయ ఉపాధ్యక్షులు బి.కె నరసింహం, ప్రధాన కార్యదర్శి నరేందర్ పాల్గొన్నారు.

## మిగిలిపోయిన భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలి

### ఎస్ఎలుగా పదోన్నతులు కల్పించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు: ఆర్‌యుపిపి రాష్ట్ర కార్యవర్గం

**హైదరాబాద్, ఆగస్టు 28 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో మిగిలిపోయిన భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజెస్‌గా పదోన్నతులు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలం గాణ (ఆర్‌యుపిపి టిజి) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. భాషా పండితులకు ప్రస్తుతం జరుగుతున్న పదోన్నతుల్లో స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ) లాంగ్వేజెస్‌గా పదోన్నతులు కల్పించిన ప్రజాప్రభుత్వానికి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహ్మద్ అబ్దుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుళ్లపల్లి తిరుమల కాంతికృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. తమ సంఘం చేసిన ప్రాతినిధ్యం మేరకు అనతి కాలం లోనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తెలుగు, హిందీ, ఉర్దూ తదితర భాషాపండితులకు స్కూల్ అసిస్టెంట్ భాషలుగా పదోన్నతులు కల్పించి నందుకు..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్నతీకరించవలసిన 1000 భాషా పండితుల పోస్టులను కూడా ఉన్నతీకరించి.. పదోన్నతులు లభించని భాషాపండితులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా ముఖ్య మంత్రిని కోరుతున్నామన్నారు. పదోన్నతుల ప్రక్రియలో సహాయసహకారాలు అందించిన రాష్ట్ర విద్యాశాఖ అధికారులందరికీ వందిత పరిషత్ పక్షాన ధన్యవాదములు తెలియజేస్తున్నామన్నారు. స్కూల్ అసిస్టెంట్ భాషలుగా పదోన్నతులు పొందిన వారికి శుభాకాంక్షలు తెలుపుతూ.. తెలంగాణ రాష్ట్రంలో భాషల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గతంలో భాషా పండితులను స్కూల్ అసిస్టెంట్స్‌గా అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులు కల్పించగా.. ప్రస్తుతం జరుగుతున్న పదోన్నతుల్లోనూ భాషా పండితులకు 500 మందికిపైగా పదో న్నతులు లభించినట్లు వారు తెలిపారు.

## ఈర్లపల్లి తండా రవినాయక్ మృతిపై విచారణ జరిపి నివేదికను ఇవ్వాలి

### మంత్రి దామోదర రాజనర్సింహా ఆదేశం

**హైదరాబాద్, ఆగస్టు28(జర్నలిస్ట్ ఫైల్):** మహబూబ్‌నగర్ జిల్లా ఈర్లపల్లి తండాకు చెందిన రవినాయక్ మృతిపై విచారణకు ఆదేశించారు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ. రవి నాయక్‌కి సకాలంలో చికిత్స అందకపోవడం వల్లనే మరణించారని పత్రికల్లో వచ్చిన వార్తల నేపథ్యంలో మంత్రి విచారణకు ఆదేశించారు. ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేసి, విచారణ జరిపించాలని అధికారులను మంత్రి మంగళవారం ఆదేశించారు. మృతికి కారణాలు ఏమిటో తేల్చి, ఎవరిదైనా నిరక్ష ్యం ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు మెడికల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్లు.. డాక్టర్ రాజారావు, డాక్టర్ నాగేందర్‌లతో కమిటీ ఏర్పాటు చేస్తూ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్రకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా నిర్లక్ష్యం జరిగి ఉంటే వైద్యులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

## జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఉపరాష్ట్రపతి అభ్యర్థిత్వాన్ని జీర్ణించుకోలేని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

### సిపిఐ జాతీయ నేత చాడ వెంకట్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు28(జర్నలిస్ట్ ఫైల్):** సెప్టెంబర్‌లో జరగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నికలో భాగంగా ఇండియా కూటమి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఉండడం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా జీర్ణించుకోలేకపోతున్నారని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి విమర్శించారు. అమిత్ షా గుజరాత్ రాష్ట్ర హోమ్ మంత్రిగా ఉన్నప్పుడు సొహరబ్ ఎన్‌కౌంటర్‌కి సంబంధించి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తీర్పుతో .. అమిత్‌షా రెండు సంవత్సరాల పాటు గుజరాత్ రాష్ట్రం వెలుపల ఉండవలసి వచ్చిందని గుర్తు చేశారు. అప్పటి తీర్పుపై అమిత్‌షా ఇప్పుడు తన అక్కసు వెళ్లగక్కుతున్నాడని చాడా మండిపడ్డారు. కేంద్ర హోంశాఖ మంత్రిగా ఉండి న్యాయ వ్యవస్థ మీద మచ్చ తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి గెలిస్తే మావోయిస్టులు 20 సంవత్సరాలు ముందుకెళ్తారని అమిత్ షా అనడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో మోడీ, అమిత్‌షా మావోయిస్టుల అవ శేషాలు లేకుండా చేయాలని చూస్తున్నారని, ఇది ప్రజాస్వామ్య మూల సూ త్రాలకు విరుద్ధమన్నారు. దేశంలో ప్రశ్నించే గొంతుకలను నొక్కుతు న్నారని, 100 శాతం వికలాంగుడైన ప్రొఫెసర్ సాయిబాబాపై నిందారోపణలు చేసి 9 సంవత్సరాలు జైలులో పెట్టడంతో చనిపోయారని, చివరికి సుప్రీంకోర్టు కూడా సాయిబాబా నిర్దోషి అని తీర్పు ఇవ్వడం పట్ల అమిత్‌షాకు చెంపపెట్టు లాంటిన్నారు చాడ వెంకట్‌రెడ్డి. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అభ్యర్థిత్వం పట్ల దేశంలోని జడ్జీలు స్పందిస్తున్నారని.. ఎన్డీఏ కూటంలో కొనసాగుతున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఆలోచించి మోడీ ప్రభుత్వంలో ప్రజాస్వామ్య రక్షణ వైపు ఉండాలని చాడ వెంకట్‌రెడ్డి సూచించారు.

## రూ.2 వేల కోట్ల రుణం తీసుకున్న సర్కార్

**హైదరాబాద్, ఆగస్టు28(జర్నలిస్ట్ ఫైల్):** రిజర్వ్ బ్యాంక్ నిర్వహించిన బహిరంగ వేలంలో తెలంగాణ రాష్ట్ర సర్కారు రూ.2 వేల కోట్లు రుణం సేకరించింది. అందుకు గాను ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను మంగళవారం ఈ వేలం వేయడం ద్వారా సమీకరించింది. ఈ రూ.2 వేల కోట్ల మొత్తానికి గాను మూడు భాగాలుగా సెక్యూరిటీ బాండ్లను సమర్పించింది. ఇందులో 26 ఏండ్ల కాలానికి రూ.500 కోట్లు, 28 ఏండ్ల కాలానికి రూ.1,000 కోట్లు, 30 ఏండ్ల కాలపరిమితితో మరో రూ.500 కోట్లు చొప్పున రుణాన్ని సమీకరించింది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ రుణాల కింద రూ.54,009 కోట్లు సమీకరించనున్నట్లు తెలంగాణ ప్రభుత్వం 2025-26 వార్షిక అంచనా బడ్జెట్‌లో ప్రతిపాదించింది. ఇందులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన ఏప్రిల్ నుండి ఇప్పటి వరకూ రూ. 33,900 కోట్లు మేర రుణం తీసుకుంది. దీంతో వార్షిక అంచనా బడ్జెట్‌లో ప్రతి పాదించిన రుణ సమీకరణలో 60 శాతం దాటింది.


## యూరియా కొరతపై బిజెపి తప్పుడు ప్రచారం తగదు

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, ఆగస్టు28(జర్నలిస్ట్ ఫైల్) :** యూరియా కొరతపై బిజెపి తప్పుడు ప్రచారం తగదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. రాష్ట్రానికి రావాల్సిన యూరియాను కేంద్రం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వానాకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నప్పటికీ, రైతు లకు కావాల్సిన యూరియాను అందించడంలో కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యధోరణితో వ్యవహరిస్తుందన్నారు. రైతులు యూరియా కొరకు నెల రోజులుగా రోడ్లపైకి వస్తున్నప్పటికీ బిజెపి నాయకులు కుంటి సాకులు చెబుతూ "కృత్రిమ కొరత" సృష్టించారనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. ఈ తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా కేంద్రం నుండి రాష్ట్రానికి కావాల్సి నంత యూరియాను తెప్పించడానికి రాష్ట్రానికి చెందిన బిజెపి ఎంపీలు, కేంద్ర మంత్రులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు అండగా నిలబడాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి 9.8 లక్షల టన్నులు యూరియా కావాల్సి ఉండగా.. 1.5 లక్షల టన్నులను కేంద్రం తగ్గించిందన్నారు. ఇవ్వాల్సిన కోటాను కూడా ఇంత వరకు సకాలంలో సరఫరా చేయకపోవడంతో యూరియా కొరత ఏర్పడిందన్నారు. రైతులంతా సహకార సంఘాలు, షాపుల ముందు పడిగాపులు కాస్తున్నారని..ప్రభుత్వ కార్యాలయాల ముందు, రహదారుల మీద నిరసనలు తెలియజేస్తున్నారని చెప్పారు. నిరసనలు జరుగుతున్న చాలా చోట్ల తొక్కిసలాటలు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ నుండైనా రాష్ట్ర అవసరాలకు యూరియాను సరఫరా చేయాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం అనేకసార్లు కోరినప్పటికీ.. ఉద్దేశ్యపూర్వకంగానే కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం యూరియా కొరతను తీర్చడానికి, బ్లాక్ మార్కెట్‌ను నిరోధించడానికి ప్రభుత్వ సంస్థలైన హాకా, సహకార సంఘాల ద్వారా సరిపడా ఎరువులను సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రానికి అవసరమైన యూరియాను కేంద్ర ప్రభుత్వం నుండి తెప్పించడానికి అన్ని రకాల చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## వ్యవసాయ విశ్వవిద్యాలయంలో డ్యూయల్ డిగ్రీ కోర్సులకు కౌన్సెలింగ్

**హైదరాబాద్ (అత్తాపూర్), ఆగస్టు 28(జర్నలిస్ట్‌ఫైల్) :** ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ ప్రాయోజిత కోటా బి.ఎస్సీ. (ఆనర్స్) అగ్రికల్చర్, బిఎస్సీ (ఆనర్స్) కమ్యూనిటీ సైన్స్, బి.టెక్ (ఫుడ్ టెక్నాలజీ), బి.టెక్( అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) కోర్సులలో సీట్ల భర్తీకి వాక్ ఇన్ కౌన్సిలింగ్ ఈనెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.ఈ. సీహెచ్ విద్యాసాగర్ ప్రకటించారు. అదేరోజు అనగా 30వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వెస్టర్న్ సిడ్నీ యూనివర్సిటీలు సంయుక్తంగా అందిస్తున్న డ్యూయల్ డిగ్రీ కోర్సు బి.ఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశాల కోసం వాక్ ఇన్ కౌన్సిలింగ్ జరగ నుందని రిజిస్ట్రార్ తెలిపారు. రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ విభాగంలో ఈ రెండు కౌన్సెలింగ్‌లు నిర్వహించనున్నట్లు వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలు, వెబ్ సైట్‌లో సూచించిన రుసుమును తీసుకొని కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని ఆయన సూచించారు. పూర్తి వివరాల కొరకు విశ్వ విద్యాలయ వెబ్‌సైట్‌ను సందర్శించగలరని రిజిస్ట్రార్ విద్యాసాగర్ తెలిపారు.



రిజిస్ట్రార్ డా.విద్యాసాగర్

# 'ఓట్ల చోరీ'పై ప్రజాభిప్రాయం

## ● ఇసి కీలక నిర్ణయం ● ఐదు ప్రశ్నలను సంధిస్తున్న ఇసి ● గుజరాత్ వ్యక్తులు బీహార్‌లో ఓటర్లుగా మారుతున్నారని విపక్షాల ఆరోపణ




**న్యూఢిల్లీ, ఆగస్టు 28 :** కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ సర్కార్ ఎన్నికల సంఘంతో కుమ్మక్కై బీహార్ ప్రజల ఓట్లను దొంగిలించే ప్రయత్నాలు చేస్తోందని ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. తాము చేపట్టిన బీహార్ ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన వివిధ అంశాలపై తమ అభిప్రాయం తెలపాలని రాష్ట్ర ప్రజలను కోరేందుకు పోల్‌ప్యానల్ అయిదు ప్రశ్నలను సిద్ధం చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

- ఓటర్ల జాబితాలను సవరించి, విస్తృతంగా పరిశీలించాలా?
- చనిపోయిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలా?
- రెండు ప్రాంతాల్లో నమోదైన ఓటర్ల పేర్లను ఒకదగ్గరి నుంచి తొలగించాలా?
- ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన ఓటర్లను జాబితా నుంచి మినహాయించాలా?
- విదేశీయులు, ఇతర రాష్ట్రాల ప్రజలు ఓటు హక్కును తిరస్కరించాలా?

ఈ ప్రశ్నల ఆధారంగా బీహార్ వ్యాప్తంగా సర్వే చేసి ఓటర్ల జాబితా సవరణపై ప్రజలు ఏమనుకుంటున్నారనే విషయాన్ని స్వయంగా తెలుసుకోవడానికి ఎన్నికలకమిషన్ ఈచర్యలు తీసుకుంటున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అనంతరం ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై తగిన సమాధానం చెప్పేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. బీహార్‌లో ఓటరు జాబితా నుంచి దాదాపు 65 లక్షల మంది ఓటర్లను తొలగించామని పేర్కొంటూ ఇసి ఇటీవల ముసాయిదా విడుదల చేసింది. ఓటర్ల జాబితాలో అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ విపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి.

గుజరాత్ వ్యక్తులు బీహార్‌లో ఓటర్లుగా మారుతున్నారని, ప్రాణాలతో ఉన్న వారిని చనిపోయినట్లుగా పేర్కొంటూ వారిని జాబితా నుంచి తొలగిస్తున్నారని పేర్కొన్నాయి. తొలగించిన ఓటర్ల పేర్లను వెల్లడించాలని డిమాండ్‌చేస్తూ విపక్షాలు సుప్రీంకోర్టులో పిటి షన్లు వేశాయి. వీటిపై విచారణచేపట్టిన న్యాయ స్థానం ఎస్ఐఆర్ కింద తొలగించిన 65 లక్షల మంది పేర్లను వెల్లడించాలని ఇసికి సూచించింది.



# ప్రధాని మోడీ, పుతిన్‌కు చైనా అధ్యక్షుని ఆహ్వానం

## ఎస్‌సిఒ సమ్మిట్‌కు రావాలని పిలుపు

**బీజింగ్, ఆగస్టు 28 :** ఆగస్టు చివరలో తియాంజిన్ వేదికగా జరగనున్న షాంఘై సహకారం సదస్సు (ఎస్‌సిఒ)లో పాల్గొనేందుకు భారత ప్రధాని మోడీ చైనా వెళ్తున్నారు. ఈ సదస్సు సందర్భంగా మోడీతోపాటు రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ స్వయంగా ఆహ్వానించనున్నారట. అమెరికా టారిఫ్‌ల వేళ.. గ్లోబల్ సౌత్ దేశాలకు (వర్థమాన దేశాలు) సంఘీభావంగా శక్తివంతమైన ప్రదర్శనలో భాగంగానే ఈ చర్య ఉండనుందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

మోడీ, పుతిన్‌తోపాటు మధ్య, పశ్చిమ, దక్షిణ, ఆగ్నేయాసియా దేశాల నేతలకు ఈ ఎస్‌సిఒ సమ్మిట్‌లో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. ఈ నెల 31 నుంచి సెప్టెంబరు ఒకటి మధ్య తియాంజిన్ వేదికగా ఈ సదస్సు జరగనుంది. ప్రధాని మోడీ చైనాలో చివరిసారిగా 2018లో పర్యటించారు. తర్వాత చైనా అధ్యక్షుడు 2019లో భారత్‌లో పర్యటించారు. ఈ తర్వాత 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్-చైనా సైనికుల మధ్య ఘర్షణతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటిని పునరుద్ధరించేందుకు సైనిక, దౌత్యాధికారుల మధ్య అనేక దఫాల్లో చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే గతేడాది రష్యాలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో చైనా అధ్యక్షుడితో ప్రధాని మోడీ భేటీ అయిన సంగతి తెలిసిందే.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో భారత్‌పై విరుచుకుపడుతోన్న వేళ.. మోడీ చైనా పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సుంకాలను డ్రాగన్ ఖండించింది. వాణిజ్య, సుంకాల యుద్ధాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నాయని వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారంలో భారత్ వెన్నంటి నిలుస్తామని ప్రకటించింది.

మరోవక్క ఢిల్లీలోని రష్యా రాయబారి మాట్లాడుతూ.. భారత్, చైనాతో కలిపి త్వరలో త్రైపాక్షిక చర్చలు జరుగుతాయని భావిస్తున్నట్లు మీడియాతో వెల్లడించారు. ఆ సదస్సు వేళ ఈ ముగ్గురు నేత మధ్య సమావేశం జరగొచ్చని తెలుస్తోంది.

కాగా.. 'చైనా, ఇరాన్,రష్యా.. ఇప్పుడు భారత్‌పై వాషింగ్టన్ తీసుకుంటున్న చర్యలు ఎలాంటి ప్రభావం చూపలేదు. ఈ తరుణంలో అమెరికా ఆధిపత్యానికి ప్రత్యామ్నాయంగా అంతర్జాతీయ క్రమం ఎలా ఉండనుందో తెలియజేసేందుకు జిన్‌పింగ్ ఈ సదస్సును ఉపయోగించుకోవాలని అనుకుంటున్నారు' అని చైనాగ్లోబల్‌సౌత్ ప్రాజెక్టు ఎడిటర్ ఇన్ చీఫ్ ఎరిక్ ఒలాండర్ అభిప్రాయపడ్డారు. ఎస్‌సిఒ చరిత్రలో ఇదే భారీ సమావేశంగా నిలుస్తుందని ఆ దేశ విదేశాంగ శాఖ సహాయమంత్రి ఇప్పటికే వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.



# జమ్మూకాశ్మీర్‌లో భారీ వర్షాలు

**శ్రీనగర్, ఆగస్టు 28 :** జమ్మూ కాశ్మీర్‌లో కురిసిన అతివృష్టి, వరదలు, కొండచరియల విరిగిపడటం తీవ్ర విషాదానికి దారితీసింది. దోడా జిల్లాలో మేఘవిస్ఫోటం, వరదల కారణంగా కనీసం ఐదుగురు ప్రాణాలుకోల్పోగా, అనేక ఇళ్లు, రహదారులు ధ్వంసమయ్యాయి. అర్థక్వారిలోని వైష్ణోదేవి ఆలయం మార్గంలో జరిగిన భారీ కొండచరియ ప్రమాదంలో పలువురు భక్తులు గాయపడి, మరికొందరు మృతి చెందినట్టు అధికారులు వెల్లడించారు. దోడా జిల్లాలో ఒక ఇల్లు కూలిపోవడంతో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు ఆకస్మిక వరదల్లో కొట్టుకుపోయారు. ప్రధాన నదులు ఉప్పొంగి పోతుండటంతో ప్రజలు నది తీరాలకు దూరంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. జోజిలా పాస్‌వద్ద కురిసిన భారీ మంచుకారణంగా శ్రీనగర్‌లేహ్ హైవే నిలిచిపోయింది. అలాగే, వందే భారత్ ఎక్స్‌ప్రెస్, శ్రీశక్తి ఎక్స్‌ప్రెస్, హేమకుంట్ ఎక్స్‌ప్రెస్‌తో సహా అనేక రైళ్లు రద్దు చేశారు.

# చైనా విద్యార్థులకు యుఎస్‌లో గేట్లు ఎత్తేస్తాం

## డొనాల్డ్ ట్రంప్ ప్రకటనతో గందరగోళం



**వాషింగ్టన్, ఆగస్టు 28 :** చైనా విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ద్వంద్వ వైఖరి ఆశ్చర్యపరుస్తోంది. ఓ వైపు టారిఫ్‌లపై బీజింగ్‌కు వార్నింగ్ ఇస్తూ వాణిజ్య యుద్ధానికి కాలు దువ్వుతూనే.. చైనా విద్యార్థులకు అమెరికా తలుపులు తెరుస్తున్నారు. ఏకంగా ఆరు లక్షల మంది చైనీస్ విద్యార్థులను అగ్రరాజ్యానికి ఆహ్వానిస్తున్నారు. ట్రంప్ తీరు సొంత పార్టీ నేతలను అసహనానికి గురిచేస్తోంది. ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వలసదారులు, విదేశీ విద్యార్థుల విషయంలో కఠిన నిబంధలను అమలుచేస్తోన్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా చైనాలో కమ్యూనిస్టు పార్టీకి చెందిన వారు, పరిశోధన రంగంలో ఉన్న వారికి వీసాలు రద్దు చేస్తామని బహిరంగంగానే హెచ్చరికలు చేశారు. భారత్ సహా ఇతర దేశాల విద్యార్థుల వీసాల ప్రక్రియను కూడా కఠినతరం చేశారు. ఈ క్రమంలోనే తాజాగా చైనా విషయంలో ట్రంప్ యూటర్న్ తీసుకోవడం గమనార్హం.

తాజాగా వైట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడిన ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'చైనీస్ విద్యార్థులను అమెరికాలోకి మేం అనుమతించబోమంటూ వచ్చిన వార్తలను విన్నాం. కానీ, మేం వారికి మన విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు కల్పించాలనుకుంటున్నాం. మనకు అది చాలా ముఖ్యం కూడా. 6 లక్షల మంది చైనా విద్యార్థులు అమెరికాకు వచ్చేందుకు అనుమతిస్తాం. ఆ దేశంతో సంబంధాలు మెరుగుపరుచుకోవాలనుకుంటున్నాం'అని ట్రంప్ వెల్లడించారు. ప్రస్తుతం అమెరికా వర్సిటీల్లో దాదాపు 2.70 లక్షల మంది చైనీస్ విద్యార్థులు చదువుకుంటున్నారు. ట్రంప్ తాజా ప్రకటన రాజకీయ వివాదానికి దారితీసింది.

ఆయన నిర్ణయాన్ని సొంత పార్టీ నేతలు, మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (మాగా) మద్దతుదారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. చైనా విద్యార్థులకు అవకాశం కల్పించడం అంటే.. 'అమెరికా ఫస్ట్' అజెండాకు ద్రోహం చేసినట్టేనని మండిపడుతున్నారు. అమెరికా విద్యార్థులకు రావాల్సిన అవకాశాలను చైనీయులకు ఎలా కల్పిస్తారని ప్రశ్నిస్తున్నారు. అయితే, ట్రంప్ నిర్ణయాన్ని అధ్యక్షుడి యంత్రాంగం సమర్థించింది. 'చైనీస్ విద్యార్థులను అనుమతించకపోతే.. అమెరికాలో 15 శాతం యూనివర్సిటీలకు పని లేకుండా పోతుంది. ఆర్థిక విధానాలను పరిగణనలోకి తీసుకునే ట్రంప్ హేతుబద్ధంగా వ్యవహరించారు' అని అమెరికా వాణిజ్య మంత్రి హోవర్డ్ లుట్నిక్ తెలిపారు.

# ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు

## పాకిస్థాన్‌కు సిడిఎస్ పరోక్ష హెచ్చరిక

**న్యూఢిల్లీ,ఆగస్టు 28:** ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు. అది ఇప్పటికీ కొనసాగుతోంది. త్రివిధ దళాధిపతి జనరల్ అనిల్ చౌహాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్ శాంతినే కోరుకుంటుందని, అయితే దానిని బలహీనతగా పొరబడకూడదని ఆయన స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్‌లోని మౌలో ఆర్మీవార్ కాలేజీలో ప్రారంభమైన 'రణ్ సంవాద్' సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందగా చేపట్టిన ఆపరేషన్ పేరును ప్రస్తావిస్తూ పాకిస్తాన్‌కు పరోక్షంగా గట్టి హెచ్చరికలు పంపారు. ఈ సందర్భంగా జనరల్ చౌహాన్ మాట్లాడుతూ, భారత్ ఎల్లప్పుడూ శాంతివైపే నిలబడుతుంది. మేము శాంతిని ప్రేమించే వాళ్లం. అయితే దానిని ఆసరాగా చేసుకుని మమ్మల్ని దెబ్బకొట్టాలని చూస్తే మాత్రం ఊరుకునే ప్రసక్తి లేదు అని అన్నారు.

గతంలో జరిగిన యుద్ధాలకు, ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాలకు వ్యత్యాసం ఉందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో యుద్ధాల స్వరూపం పూర్తిగా మారిపోతుందని ఆయన విశ్లేషించారు. దీనిని ప్రభావితం చేసే నాలుగు ముఖ్యమైన అంశాలను ఆయన వివరించారు. రాజకీయ లక్ష్యాలను సాధించడానికి చిన్నపాటి యుద్ధాలను ఉపయోగించే ధోరణి దేశాల మధ్య పెరిగింది. యుద్ధం, శాంతి మధ్య తేడా చెరిగిపోతోంది. ఒకప్పుడు యుద్ధాలు భూభాగం కోసం జరిగితే, ఇప్పుడు ప్రజల ప్రాణాలకు ఎక్కువ విలువ ఇస్తున్నారు. గతంలో శత్రువులకు కలిగించిన నష్టం ఆధారంగా విజయాన్ని అంచనావేసేవారు. కానీ ఇప్పుడు ఆపరేషన్ల వేగం,



కచ్చితత్వంతో కూడిన దాడులు విజయాన్ని నిర్ధారిస్తున్నాయి అని ఆయన తెలిపారు. వికసిత భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశం సశస్త్ర, సురక్షిత్, ఆత్మనిర్భర్‌గా ఉండాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. కేవలం సాంకేతికతలోనే కాకుండా, ఆలోచనలు, ఆచరణలో కూడా స్వయం సమృద్ధి సాధించాలన్నారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా వాయు, జల, భూతల మార్గాల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి త్రివిధ దళాల మధ్య మరింత సమన్వయం అవసరమని ఆయన పేర్కొన్న విషయం తెలిసిందే. రెండు రోజుల పాటు జరిగే ఈ రణ్‌సంవాద్ సదస్సు ముగింపు కార్యక్రమంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రసంగించారు.

# గాంధీ కుటుంబమే నా దైవం

## కర్ణాటక డి.సిఎం డికె శివకుమార్

**బెంగళూరు, ఆగస్టు 28 :** బిజెపిని విమర్శించేందుకే నేను ఆ పాటపాడాను. కానీ కొందరు దీని ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని అనుకుంటున్నాను. ప్రజల్లో గందరగోళం సృష్టించాలని చూస్తున్నారు. నేను ఎవరి మనోభావాలు దెబ్బతీయాలని అనుకోవడం లేదు. ఈ వ్యవహారంతో ఎవరైనా బాధపడిఉంటే అందుకు చింతిస్తున్నాను. నేను క్షమాపణలు చెప్తాను. అయితే అవి రాజకీయ ఒత్తిడివల్ల చెప్పే క్షమాపణలు కాదుఅని డికె వెల్లడించారు. అలాగే గాంధీ కుటుంబం కాంగ్రెస్ పార్టీపై తనకున్న నిబద్ధత తిరుగులేనిదని వ్యాఖ్యానించారు. నేను కాంగ్రెస్ వ్యక్తిగానే జన్మించా. అలాగే మరణిస్తా. గాంధీ కుటుంబం నాకు దైవంతో సమానం. నేను వారి భక్తుడిని అని స్పష్టంచేశారు.

# సంక్షిప్తంగా..

### శ్రీలంక మాజీ అధ్యక్షుడు విక్రంసింఘేకు బెయిలు

**కొలంబో, ఆగస్టు 28 :** శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్‌విక్రమ్‌సింఘేకు మంగళవారం కొలంబో ఫోర్ట్ మెజిస్ట్రేట్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై రణిల్‌విక్రమ్‌సింఘేను ఈ నెల 22న అరెస్టు చేసిన విషయం విదితమే. ఓవైపు రణిల్ మద్దతుదారులు కోర్టు ఆవరణలో గుమిగూడిన సందర్భంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య మంగళవారం మధ్యాహ్నం కోర్టుకు ఆయనకు అనారోగ్య కారణాలరీత్యాత బెయిల్ మంజూరు చేసింది. ఈ నెల 22న విక్రమ్‌సింఘేను కస్టడీలోకి తీసుకోగానే ఆయనను జైలులోని ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత కొలంబో నేషనల్ హాస్పిటల్‌లోని ఐసియులో ఉంచి అప్పటి నుంచి చికిత్స అందజేస్తున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి అధికారులు స్థానిక మీడియాతో మాట్లాడుతూ 76 యేళ్ల వయసున్న రణిల్‌కు హైబిపి, మధుమేహానికి సంబంధించి చికిత్స అందిస్తున్నామన్నారు.

### శ్రీదేవి ఆస్తి కబ్జా అయిందని కోర్టును ఆశ్రయంచిన బోనీ కపూర్

**హైదరాబాద్, ఆగస్టు 28 (జర్నలిస్ట్ ఫైల్) :** ఒకప్పటి బాలీవుడ్ అగ్ర హీరోయిన్ దివంగత శ్రీదేవి ఆస్తిని చెన్నై నగరానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఆక్ర మించుకున్నారని ఆరోపిస్తూ ఆమె భర్త బోనీ కపూర్ చెన్నై హైకోర్టును ఆశ్రయించారు. 1988 ఏప్రిల్‌లో శ్రీదేవి మద్రాసులో సంబంద మొదలియార్ అనే వ్యక్తి దగ్గర ఒక స్థిరాస్తిని కొన్నారు. మొదలియార్‌కు ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు వున్నారు. అందరి సంతకాలు చేసిన తరువాత తన భార్య శ్రీదేవి ఈ ఆస్తిని కొన్నదని ఆయన హైకోర్టుకు తెలిపారు. అయితే ఈ ఆస్తిలో తమకూ వాటా వుందని చెబుతూ మొదలియార్ రెండవ భార్య కుమారులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అప్పీల్ చేసి చట్టవిరుద్ధంగా హక్కులు పొందారని బోనీ కపూర్ తెలిపారు. చట్ట విరుద్ధంగా తన భా ర్య ఆస్తిని మరొకరికి రావడంలో అధికారుల పాత్ర వుందని బోనీ కపూర్ ఆవేదన చెందారు. దీనిపై విచారించిన న్యాయమూర్తి ఆనంద్ ఈ కేసును నాలుగు వారాల్లో తేల్చాలని తాంబరం తహసీల్దార్‌ను ఆదేశించారు.

### పాక్ గూఢచారి మోతీరాంకు భారీ నెట్‌వర్క్

**హైదరాబాద్, ఆగస్టు 28 (జర్నలిస్ట్ ఫైల్) :** సిఆర్‌పిఎఫ్‌లో ఎఎస్‌ఐగా పనిచేస్తూ పాక్ గూఢ చార సంస్థ ఐఎస్‌ఐతో జతకట్టి అరెస్టయిన మోతీరాంకు అ టు పాక్ ఇటు భారత్‌లో భారీ నెట్‌వర్క్ వున్నట్లు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) గుర్తించింది. మోతీరాం జాట్ భారత సైన్యంతో పాటు పారా మిలటరీ బలగం, ప్రభుత్వ విభాగాల్లో కీలక హోదాలో వున్న పలువురు టచ్‌లో వున్నట్లు ఎన్ఐఎ గుర్తించింది. వీరిలో నలుగురు మిలటరీ అధికారులు, మరో ఇద్దరు పారా మిలటరీ అధికారులు మిగతా వారు ప్రభుత్వ విభాగాలకు చెందిన వారుగా ఎన్ఐఎ గుర్తించింది. మోతీరాం జాట్‌ను గత మే నెల 27వ తేదీన ఎన్ఐఎ అరెస్టు చేయడం తెలిసిందే. జాట్‌ను అరెస్టు చేసిన తరువాత ఈ కేసు విచారణను ఎన్ఐఎ చేబట్టడం విదితమే. దీని తరువాత అతని ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న ఎన్ఐఎ అందులోని నంబర్లను విశ్లేషించగా 15 మందితో అతను తరచూ మాట్లాడుతున్నట్లు తేలింది. ఇందులో అనేక కాల్స్ ఇంటర్నెట్‌విగా వున్నాయి. జాట్ పాకిస్తాన్‌లోని లాహోర్‌కు చెందిన సలీం అనే ఆపరేటర్‌తో తరచూ సంభాషించేవాడని ఎన్ఐఎ తేల్చింది.

### భారీ వరదలతో మనాలిలో కొట్టుకుపోయిన రోడ్లు, హోటళ్లు



**మనాలీ, ఆగస్టు 28 :** హిమాచల్ ప్రదేశ్‌పై మళ్లీ ప్రకృతి తన ప్రకోపాన్ని చూపించింది. తీవ్ర స్థాయి వర్షాల వల్ల కొండచరియలు విరిగివడ్డాయి. భారీ వరదలు వల్ల కిరాట్పూర్, మనాలీ జాతీయ రహదారిపై నష్టం జరిగింది. దీంతో మండీ, మనాలీలో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించి పోయింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల బియాస్ నది ఉప్పొంగుతున్నది. దాని ఉప నదులు కూడా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో ఎమర్జెన్సీ చర్యలు చేపడుతున్నారు. జాతీయ రహదారి పలు ప్రదేశాల్లో బ్లాక్ అయింది. మనాలీ సమీపంలో ఉన్న బిందు ధంక్ వద్ద బియాస్ నది వరద నీటికి జాతీయ హైవే కొట్టుకుపోయింది. దీంతో పాపులర్ టూరిస్టు కేంద్రానికి రాకపోకలు తెగిపోయాయి. మనాలీలో నది సమీపంలో ఉన్న ఓ హోటల్ ఆ వరదలో కొట్టుకు పోయింది. మండి, కులు ప్రాంతాల్లో డేంజర్ మార్క్ దాటి నది ప్రవహిస్తున్నది. లోతట్టు ప్రాంతాల్లో జీవిస్తున్న వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. బహంగ్, అలూ గ్రౌండ్ ప్రాంతాల నుంచి జనాలను తరలిస్తున్నారు. మరో 24 గంటలపాటు నది సమీపానికి వెళ్లవద్దు అని టూరి స్టులకు అధికారులు వార్నింగ్ ఇచ్చారు.

# అమెరికా టారిఫ్‌ల ప్రభావం తగ్గొచ్చు

## భారత్, యుఎస్ వాణిజ్య చర్చలు సఫలం అయ్యే అవకాశం

## ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఆశాభావం



**ముంబై, ఆగస్టు 28 :** భారత్‌అమెరికా మధ్య వాణిజ్య ప్రతినిధుల చర్చలు సఫలం కాగలవన్న ఆశాభావాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా వ్యక్తం చేశారు. రష్యా నుంచి పెద్ద ఎత్తున ముడి చమురు కొనుగోళ్లకుగాను దేశీయ ఎగుమతులపై 25 శాతం జరిమానాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. బుధవారం నుంచే ఇవి అమల్లోకి రానున్నాయి. దీంతో అగ్రరాజ్యంలోకి దిగుమతయ్యే భారతీయ వస్తూత్పత్తులపై సుంకాల భారం 50 శాతానికి చేరబోతున్నది. ఇప్పటికే ఆ దేశంతో వాణిజ్య ఒప్పందం ఆలస్యానికిగాను వేసిన 25 శాతం టారిఫ్‌లు అమల్లో ఉన్నాయి మరి. ఈ క్రమంలోనే ఇరు దేశాల నడుమ వాణిజ్య ఒప్పందం కుదురుతుందన్న ఆకాంక్షను సోమవారం ఇక్కడ ఫిక్కి, ఐబీఏ (ఫిబక్) నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ కనబర్చారు. వాణిజ్య చర్చలు సఫలమైతే భారత ఆర్థిక వ్యవస్థపై టారిఫ్‌ల ప్రభావం తగ్గొచ్చన్న విశ్వాసాన్ని వెలిబుచ్చారు. అమెరికా టారిఫ్‌లు భారత్‌పై 50 శాతానికి పెరిగితే వస్త్ర, రొయ్యల ఎగుమతులు ఖరీదెక్కనున్నాయి. ఇదే జరిగితే దేశంలో ఆయా రంగాలపై ఆధారపడ్డ వ్యాపారాలు, పరిశ్రమలు, ఉద్యోగులు, రైతులు ఇబ్బందుల్లో పడ్డట్టేనన్న ఆందోళనలు కనిపిస్తున్నాయి.

**ద్రవ్య విధానంపై..**

దేశంలో ద్రవ్యోల్బణం, జిడిపి వృద్ధిరేటు రెండింటిపైనా ఆర్బీఐ దృష్టి పెడుతుందని, వాటికి అనుగుణంగానే తమ ద్రవ్య విధానం కొనసాగుతుందని ఈ సందర్భంగా మల్హోత్రా స్పష్టం చేశారు. ఈ ఏడాది మొదలు ద్రవ్య సమీక్షల్లో కీలక వడ్డీరేటైన రెపో రేటును ఆర్బీఐ క్రమేణా తగ్గిస్తూ వస్తున్న సంగతి విదితమే. ఇప్పటిదాకా 4 ద్రవ్య సమీక్షలు జరుగగా.. మూడింటిలో 1 శాతం రెపో రేటు దిగింది. ఈ నెల సమీక్షలో మాత్రం యథాతథంగానే ఉంచింది. ఈ నేపథ్యంలో ఇక రాబోయే ద్రవ్య సమీక్షల్లో కేవలం జిడిపి బలోపేతంపైనేగాక, ధరల అదుపు కోణంలోనూ ఆలోచించి నిర్ణయాలుంటాయని ఆర్బీఐ గవర్నర్ స్పష్టం చేశారు. అమెరికా టారిఫ్‌లు, అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితులకుతోడు ద్రవ్యోల్బణం అంశాలూ ఆర్బీఐ ముందు కీలకంగా ఉన్నాయంటున్నారు.

**పెట్టుబడులకు కలిసి..**

వృద్ధి లక్ష్యాలను ఆర్బీఐ విస్మరించట్లేదన్న మల్హోత్రా.. టారిఫ్‌లు, భౌగోళికరాజకీయ ఆందోళనల నుంచి సవాళ్లు ఎదురవుతున్న దృష్ట్యా కార్పొరేట్లు, బ్యాంకులు కలిసి పెట్టుబడులకు ఊతమివ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో దేశ ఆర్థికాభివృద్ధికున్న అవకాశాలను వదులుకోలేమని, ఆర్థిక విస్తరణకున్న అన్ని మార్గాలనూ మరింత పెంచుకోవాలని సూచించారు. అందుకే బ్యాంకుల బ్యాలెన్స్ షీట్లు, కార్పొరేట్ల పనితీరు అత్యుత్తమంగా కనిపిస్తున్న ప్రస్తుత తరుణంలో ఆయా రంగాల్లో పెట్టుబడులకు దన్నుగా నిలవాలని చెప్పారు.

**క్రెడిట్ డిమాండ్ తగ్గింది: శెట్టి**

కార్పొరేట్ల నుంచి రుణాల డిమాండ్ తగ్గిందని ప్రభుత్వ రంగ ఎస్బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి అన్నారు. నేడు మెజారిటీ కార్పొరేట్ సంస్థలు ప్రైవేట్ క్రెడిట్ వట్ల ఆసక్తి చూపిస్తున్నాయని, నిధుల సమీకరణ కోసం క్యాపిటల్ మార్కెట్లలోకి ప్రవేశిస్తున్నాయని చెప్పారు. దీంతో దేశ వృద్ధి లక్ష్యాల సాధన కోసం పెద్ద ఎత్తున వచ్చే పెట్టుబడులకు దన్నుగా నిలవడానికి బ్యాంకులు చూస్తున్నాయని తెలిపారు. ఈ క్రమంలోనే బ్యాంకులపైనున్న కొన్ని రకాల ఆంక్షలు తొలగిపోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అయితే ఇందుకు ఆర్బీఐ గవర్నర్ మల్హోత్రా సానుకూలంగా స్పందించారు.

**ఎఐతో బ్యాంకింగ్‌కు కొత్త రూపు**

భారతీయ బ్యాంకింగ్ రంగం కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ లేదా ఎఐ)తో కొత్తరూపును సంతరించుకోగలదని ఓ నివేదిక అభిప్రాయపడింది. ఉద్యోగాలపై ఏఐ ప్రభావంపట్ల ఆందోళనలు కనిపిస్తున్న వేళ ఇదివ్పుడు మిక్కిలి ప్రాధాన్యాన్ని దక్కించుకుంటున్నది. కాగా, బ్యాంకులు ఏఐని అందిపుచ్చుకుంటే ఎన్నో లాభాలను పొందగలవని బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బిసిజి) ఈ రిపోర్టులో పేర్కొన్నది. గడిచిన దశాబ్ద కాలంలో బ్యాంకులు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై చేసే ఖర్చులు ఐదింతలు పెరిగాయని, ఉత్పత్తిలో అందుకు ఒనగూరిన లాభం మాత్రం 1 శాతమేనని గుర్తుచేసింది. అయితే ఎఐతో ఈ తరహా నష్టాలను అధిగమించవచ్చని చెప్పింది. నిజానికి ఇప్పటికే అనేక బ్యాంకులు ఏఐ సాధనాలు వినియోగిస్తున్నాయని తెలిపింది.

## అర్హులైన దివ్యాంగుల పెన్షన్లు తొలగించం



○ మంత్రి సవిత

**పెనుకొండ/శ్రీ సత్యసాయి (జర్నలిస్ట్ ఫైల్):** అర్హులైన దివ్యాంగుల పెన్షన్లు తొలగించే ప్రసక్తే లేదని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత స్పష్టం చేశారు. వైసీపీ అబద్ధాలు ప్రచారం చేస్తోందని ఆమె మండిపడ్డారు. పి.రొప్పాలలో రూ. 2 కోట్లతో పీహెచ్సీ భవనం, ఎన్టీఆర్ విగ్రహానికి భూమి పూజ చేశారు. ప్రతి పంచాయతీ కేంద్రంలోనూ ఎన్టీఆర్ విగ్రహాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. పెనుకొండలో టీడీపీ కార్యాలయం, అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు.

## పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయండి



○ గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** పెండింగులో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, బెయిల్ రాని వారెంట్లను తక్షణమే అమలు చేయాలని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ ఆయన, మాదకద్రవ్యాలు, మహిళలపై దాడులు, శారీరక దాడుల కేసుల్లో వారెంట్లు అమలు చేయాలని స్పష్టం చేశారు. హత్యలు, అత్యాచారాలు, ఆస్తి సంబంధిత నేరాలపై దర్యాప్తును ప్రాధాన్యంగా తీసుకుని గడువు లోపు ఛార్జ్‌షీట్‌లు దాఖలు చేయాలని సూచించారు. కొత్త నేర చట్టాల ప్రకారం 60, 90 రోజుల్లో విచారణ పూర్తి చేయడం తప్పనిసరి అని గుర్తు చేశారు. తెలుపు కాలర్ నేరాలు, మాదక ద్రవ్యాల కేసుల్లో కఠిన చర్యలు తీసుకోవాలని, పునరావృత నేరస్తులపై ప్రత్యేక చట్టాల కింద చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. ప్రజల భద్రత, నేర నియంత్రణలో కట్టుదిట్టమైన చర్యల ద్వారా పోలీసులపై నమ్మకం పెంచాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు జివి రమణమూర్తి, ఎటివి రవికుమార్, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

## పీఏసీఎస్ చైర్మన్ పిచ్చిరెడ్డి కి అభినందనలు



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి పెదకోనేరు వద్ద ఉన్న మంగళగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో ఇటీవల సంఘం చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన గాదె పిచ్చిరెడ్డిని గురువారం నంబూరు ప్రోలయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు కలిసి అభినందించారు. సంఘం అధ్యక్షులు ఈమని ప్రతాపరెడ్డి, నాయకులు పిచ్చిరెడ్డిని శాలువాతో సత్కరించి బొకే అందజేశారు. అనంతరం ప్రతాపరెడ్డి మాట్లాడారు. మూడు దశాబ్దాల పైగా పార్టీలో పనిచేస్తున్న పిచ్చిరెడ్డి సేవలను దేశం పార్టీ గుర్తించి చైర్మన్ పదవి ఇచ్చి గౌరవించడం అభినందనీయమన్నారు. నంబూరు జడ్పీ హైస్కూల్ 75 సంవత్సరాల ఫంక్షన్ కు సహకరించడంతోపాటు, హైస్కూల్లో నిర్మాణం జరిగిన ప్లాటినం జూబ్లీ భవన నిర్మాణానికి గ్రామంలోని పూర్వ విద్యార్థుల నుంచి రెండు లక్షల రూపాయలు సేకరించి ఆర్థిక సహకారం అందించారన్నారు. పిచ్చిరెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. చైర్మన్ పిచ్చిరెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థిగా హైస్కూల్ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామన్నారు. రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ సహకారంతో పీఏసీఎస్ పరిధిలోని తొమ్మిది గ్రామాల రైతులకు అందుబాటులో ఉండి, రైతాంగం అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి, హైకోర్టు అడ్వకేట్ డాక్టర్ నంబూరు నాగేశ్వరరావు, సంఘం ప్రతినిధులు అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి, తులాబందుల తాతయ్య, వల్లభాపురపు రాజకుమార్, ఆర్దల శంకరరావు పాల్గొన్నారు.

## అడవిశోభతో...అలంకరించిన వేదికపై మట్టిగణపతికి భక్తిమీర పూజలు



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్) :** ధ్యాత్మిక చింతనకు కళాత్మకతను జోడించి, అడవిలో గణపతి ఉత్సవాలు నిర్వహించిన తీరుగా, నీటి కాలుష్యాన్ని నియంత్రిస్తూ ఎనిమిది అడుగుల మట్టి వినాయక విగ్రహానికి, గణపతి ఫ్రెండ్ సర్కిల్ యువకులు భక్తి మీర పూజలు చేసారు. మారీస్ పేటలో గణపతి నవరాత్రి ఉత్సవాలను గత ఎనిమిది సంవత్సరాలుగా కొనసాగిస్తూ, నవమ గణపతి ఉత్సవాలను బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఎనిమిది అడుగుల, మట్టి గణపతి విగ్రహాన్ని, విజయవాడ వద్ద గల నున్న గ్రామంలో తయారు చేయించి, పర్యావరణ ప్రేమికులయ్యారు. ఆధ్యాత్మిక చింతనకు, కాస్తంత కళాత్మకతను జోడించారు. అడవి సెట్ అలంకణచేసి, ప్రకృతి రమణీయతను చాటుతూ,మట్టి వినాయకుని ఉత్సవానికి ముస్తాబుచేసి, వినాయక చవితి పర్వదిన వేళ ఘనంగా పూజలు నిర్వహించారు. ఆదివారం వరకు నిర్వహించే ఉత్సవాల కార్యాచరణలో, 29వ తేదీ శుక్రవారం మహాగణపతి హెూమం నిర్వహిస్తున్నట్లు, 30వ తేదీ శనివారం లలిత సహస్రనామ పారాయణం, 31వ తేదీ ఆదివారం లడ్డు వేలం పాట, స్వామి వారి నిమజ్జనం కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నట్లు గణేష్ ఫ్రెండ్ సర్కిల్ కార్యవర్గం మీడియాకు వివరించారు.

# మున్సిపల్ అధికారుల తీరు, నిర్లక్ష్యంపై మండిపడ్డ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

○ గుంటూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రజా సమస్యల పై ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఫైర్



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి గురువారం జరిగిన గుంటూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో పాల్గొని ప్రజాసమస్యల పై గళమెత్తారు. అధికారులు, ప్రజా సమస్యల పై నిర్లక్ష్యం ప్రదర్శించడం ప్రజలను మోసం చేయడమేనని గళ్ళా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భముగా అనేక ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకొని వచ్చారు.

**కుక్కల బెడద - ప్రజల ప్రాణాలకు హామీ లేకుండా పోతున్నాయి**

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోందని, చిన్న పిల్లలు వీధి కుక్కల దాడికి బలై ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నా అధికారులు నిద్రలేచే పరిస్థితి లేదని ఆమె మండిపడ్డారు. "జంతు ప్రేమికులతో సొసైటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామని, అది ఎందుకు ముందుకు కదల్లేదో అధికారులు చెప్పాలి" అని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

**అక్రమ కాంట్రాక్టర్ల మాఫియా**

గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న పనుల్లో అవకతవకలు వెలుగులోకి వస్తున్నాయని, అర్హత లేని కాంట్రాక్టర్లు పెద్ద కాంట్రాక్టర్ల ముసుగులో అన్ని పనులు దక్కించుకుంటున్నారని, "ప్రజల పన్నుల డబ్బుతో జరుగుతున్న అభివృద్ధి పనులు నిజమైన అర్హుల చేతికి వెళ్లకపోవడం విచారకరం. ప్రజలకు నాణ్యమైన పనులు అందకపోవడమే కాకుండా, బోగస్ కాంట్రాక్టర్ల కారణంగా నగర అభివృద్ధి దెబ్బతింటోంన్నారు.

**అక్రమ ఎల్ఈడి హోర్డింగులు - ప్రమాదాలకు అడ్డాలు**

**ఏకపక్ష హోర్డింగుల అనుమతులపై ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆగ్రహం**

"గత సమావేశంలో అక్రమ హోర్డింగులపై నేను ప్రశ్నించగా 60 మంది హోర్డింగ్ నిర్వాహకులు ఉన్నారని అధికారులే చెప్పారనీ, కానీ ఇప్పుడు ఎలాంటి పారదర్శకత లేకుండా చైతన్య డిజిటల్ మీడియాకు ఏకపక్షంగా హోర్డింగుల హక్కులు కేటాయించామని బయటపెట్టారు" అని ఎమ్మెల్యే మండిపడ్డారు. అదే విధంగా ఎక్కడా కూడా కెమెరాలు లేకపోయినా అనుమతులు ఇచ్చిన తీరు అర్థం కాని విషయమని గళ్ళా మాధవి ప్రశ్నించారు. "ప్రజా భద్రతను పక్కన పెట్టి, ఏ ఆధారంపై ఈ అనుమతులు ఇచ్చారు? ప్రజల ప్రాణాలకు ముప్పు తెచ్చే ఈ ఎల్ఈడి హోర్డింగులను వెంటనే తొలగించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి డిమాండ్ చేశారు.

**పేదలపై ఆక్రమణల పేరుతో దాడులు ఆపాలి**

గుంటూరు నగరంలో ఆక్రమణ తొలగింపులు పేరుతో అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు దీని వలన రోజువారి కూలి పనులు చేసుకుని బతికే పేదలు చితికి పోతున్నారు కాబట్టి పేదల కోసం నిబంధనలు సడలించి, వారికి మరో చోటా ఏర్పాటు చేసుకొని అవకాశం ఇవ్వలన్నారు.

**వీధి దీపాలు లేక చీకటిలో ప్రజలు %-% అసాంఘిక శక్తులకి అడ్డా**

గుంటూరు పశ్చిమ నియోజకవర్గం లో పలు డివిజ న్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, పదేపదే కోరిన కూడా ఎక్కడా కూడా ఏర్పాటుచేసిన పాపాన పోలేదు దీనివలన మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అదేవిధంగా శివారు ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. అధికారులు మన సంతృప్తి పరచాలని ప్రజలకు అవసరమయ్య మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు

**డీసిల్టేషన్ పనులు - తూతూ మంత్రం**

కాలువలలో డీసిల్టేషన్ పనులు సక్రమంగా జరగకపోవడంతో ప్రజలు ఇళ్ల ముందు మురికి నీటితో ఇబ్బందులు పడుతున్నారని గళ్ళా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. "డీసిల్టేషన్ జరుగుతోందని చెబుతున్నారు, కానీ మాకు సమాచారం ఇవ్వడం లేదు. ప్రధాన కాలువల్లో తూతూ మంత్రం పనులు చేసి తప్పించుకుంటున్నారు" అంటూ ఆమె మండిపడ్డారు.

# శ్మశాన వాటికల పనులు రెండు నెలల్లో పూర్తవ్వాలి

○ అన్ని శ్మశాన వాటికల వద్ద వాచ్మెన్లు ఏర్పాటు చేయాలి

○ సచివాలయ సిబ్బందిని నియమించాలి

○ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో గళం వినిపించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** "గుంటూరు తూర్పు నియోజకవర్గంలో రెండు శ్మశాన వాటికల అభివృద్ధి గురించి ఎనిమిది నెలలుగా అడుగుతూనే ఉన్నాం. కేవలం 40% మాత్రమే పనులు పూర్తయ్యాయి ఇవి అసంపూర్తిగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్మశాన వాటికలను రెండు నెలల్లో పూర్తి చేయాలి" అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గురువారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ గుంటూరు నగరాభివృద్ధి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, కనీస మౌలిక వసతుల కల్పన, అధికారుల ఉదాసీనత, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంపై తన గళం వినిపించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని ఏటుకూరు రోడ్డులో హిందూ శ్మశాన వాటికతోపాటు మరో శ్మశాన వాటిక పనులు ప్రారంభించిన ఇప్పటి వం-కు పూర్తి చేయలేదని తెలిపారు.

సదరు కాంట్రాక్టర్ కు కుదరకపోతే రద్దు చేయాలని అధికారులకు సూచించారు. పాత గుంటూరు శ్మశాన వాటికలో కోటి రూపాయలతో ఏర్పాటు చేసిన మిషన్ నిరుపయోగంగా ఉందని, దీనిని అధికారులు ఎందుకు పట్టించుకోవట్లేదని ప్రశ్నించారు. 15 రోజుల్లోగా శ్మశాన వాటిక పనులు ప్రారంభించి రెండు నెలల్లో పూర్తవ్వాలన్నారు. దీంతోపాటు అన్ని శ్మశానవాటికలు, నల్లచెరువు వాకింగ్ ట్రాక్ వద్ద వాచ్మెన్ నియామకం చేపట్టాలని కోరారు. సచివాలయ సిబ్బంది తక్కువగా ఉండడంతో ప్రజా సేవలకు అంతరాయం కలుగుతుందని, పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సచివాలయాల రేషనలైజేషన్ ప్రక్రియలు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.

# గుంటూరులో డ్రైన్ల శుభ్రతపై నగర కమిషనర్ దృష్టి



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరంలో వర్షాకాలం కారణంగా డ్రైన్లు పొంగిపోవడం, మురుగునీటి నిల్వలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులు ఆదేశించారు. గురువారం ఆయన ఏటి అగ్రహారం, అంకమ్మనగర్, కంకరగుంట ఆర్యూబి, బ్రాడిపేట, అరండల్‌పేట తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్యం, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు.

కమిషనర్ మాట్లాడుతూ, అంతర్గత డ్రైన్లను నిరంతరం శుభ్రపరిస్తే డ్రైన్లు పొంగిపోవడాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. మురుగు ప్రధాన డ్రైన్లలో కలిసే ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన మెష్‌ల వద్ద వ్యర్థాలను తరచుగా తొలగించాలని సూచించారు. అలాగే, బ్రాడీపేట 1/18లో రోడ్డు విస్తరణ పనుల్లో డెబ్రిస్ తొలగించాలని, అరండల్‌పేటలో మూడు వంతెనల వద్ద వర్షపు నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. డ్రైన్లలో మురుగుపారుదలకు అడ్డుగా ఉన్న ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో డీఈఈ వెంకటరమణ, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమించాలి



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** 2000 సంవత్సరంలో విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా హైదరాబాదులో బషీరాబాద్ వద్ద జరిగిన పోరాటంలో అమరులైన వారి త్యాగాల స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సిపిఐ,సిపిఎం, నాయకులు పిలుపునిచ్చారు.

తాడేపల్లి బోసుబొమ్మ సెంటర్ లో సిపిఐ, సిపిఎం, ఆధ్వర్యంలో సంస్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. సిపిఐ, సిపిఎం నాయకులు మాట్లాడుతూ 2000 సంవత్సరంలో ఆనాటి టిడిపి ప్రభుత్వం విద్యుత్ రంగంలో సంస్కరణ తీసుకువచ్చి ప్రజలపై పెను బారాలు మోపడం జరిగిందని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో జరిగిన విద్యుత్ వ్యతిరేక పోరాట ఉద్యమంలో ప్రజలు లక్షలాదిమంది పాల్గొని ఉద్యమించాలని అన్నారు. ఆ ఉద్యమ స్ఫూర్తితో మరల ఆంధ్రప్రదేశ్లో స్మార్ట్ మీటర్లు బిగించడానికి ప్రభుత్వం తీసుకుని నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని విద్యుత్ వినియోగదారులకు పిలుపునిచ్చారు. గత వైసిపి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల విధానాన్ని తీసుకువచ్చిందని అన్నారు. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న టిడిపి నాయకులు స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని ప్రజలకు పిలుపునివ్వడం జరిగిందని అన్నారు. నేడు అదే నాయకులు స్మార్ట్ మీటర్లను బిగించడానికి పూనుకున్నారని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకరకంగా, అధికారం లేనప్పుడు మరొకరకంగా పాలక పార్టీల నాయకులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 14 నెలల పాలనలో 27,000 కోట్ల రూపాయలు విద్యుత్తు బారాలు వినియోగదారులపై వేయడం జరిగిందని విమర్శించారు. విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని చెప్పిన మంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట తప్పారని అన్నారు. ఈ కార్యక్రమం లో సిపిఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య, సహాయ కార్యదర్శిలు తుడిమెల్ల వెంకటయ్య, ముసునూరు సుహాసు, సిపిఎం జొన్న శివశంకర్ రావు పట్టణ కార్యదర్శి బురగ వెంకటేశ్వర్లు,వేముల దుర్గారావు,గాదె సుబ్బారెడ్డి, డివి భాస్కర్ రెడ్డి,సిపిఐ, సిపిఎం నాయకులు షేక్ బాషా, ప్రసాద్, రాజు, అలీ, లక్ష్మణ్,వై. బర్నబాస్, డి.విజయబాబు,కె. మేరీ, బాబ్జి,తదితరులు పాల్గొన్నారు.

# అన్ని పండుగలలో విశిష్టం - కుల మతాలకు అతీతం

○ ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ప్రజలందరికీ ఆశీస్సులు అందించాలని.. క్షేమ, స్థైర్య, ఆయురారోగ్యాలు, సకల సంపదలు సిద్ధింపచేయాలని.. సకల శుభాలు కలుగజేయాలని.. శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి వినాయకుడిని వేడుకున్నారు. బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పాల్గొని గణనాథునికి విశిష్ట పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, మనం జరుపుకునే ప్రతి పండుగకూ ఒక ప్రత్యేకత ఉందని.. అందులో వినాయక చవితి పండుగ మరీ విశిష్టత కలిగినదని.. పేర్కొన్నారు. చిన్న పెద్ద అన్ని వయసుల వారు కులమతాలకు అతీతంగా జరుపుకునే పండుగ అని ఆయన వివరించారు. అందుకే ఏ శుభకార్యం ప్రాంభించాలన్నా.. ముందుగా గణపతి పూజ చేయడం మన సంప్రదాయమని ఆయన తెలిపారు.

విఘ్నాలు తొలగించి జ్ఞానం, బుద్ధి ప్రసాదించే దైవంగా గణపతిని భావిస్తామని లేళ్ళ అప్పిరెడ్డి చెప్పారు. విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో మంచి పనులకు విఘ్నాలు తొలగిపోయి, ప్రజలందరికీ సకల శుభాలూ కలగాలని.. విజయాలు సిద్ధించాలని.. ఇంకా గణనాథుని కరుణా కటాక్షాలతో రాష్ట్రంలోని ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి అభిలషించారు.

ఈ కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), షేక్ రోషన్, అచ్చాల వెంకటరెడ్డి, బూసి రాజలత, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బత్తుల దేవానంద్, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు, ఓర్చు శ్రీనివాసరావు, పానుగంటి చైతన్య, షేక్ రబ్బానీ, బైరెడ్డి రవీంద్రారెడ్డి, రెడ్డి కోటేశ్వరరావు, నవీన్, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకుని ప్రతిమలు పర్యావరణ రక్షిస్తుంది



○ 15 సంవత్సరాలుగా మట్టి వినాయకుల ప్రతిమలను పంపిణీ చేస్తున్న జన చైతన్య సమితి

**పెదకూరపాడు, (జర్నలిస్ట్ ఫైల్):** మట్టి వినాయకుని ప్రతిమలు పర్యావరణాన్ని రక్షిస్తుందని, ప్రకృతికి అనుకూలమైనవని అవి సులభంగా భూమిలో కలిసిపోతాయని పెదకూరపాడు అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ భూక్యా రాంజీ నాయక్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో జనచైతన్య సమితి ఆధ్వర్యంలో జవ్వాది సతీష్ సహకారంతో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏఎస్ఐ రాంజీ నాయక్ మాట్లాడుతూ ప్రతి ఏడాది జన చైతన్య సమితి సేవా సంస్థ మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందన్నారు. పెదకూరపాడు మాజీ ఉప సర్పంచ్ గుంటుపల్లి కోటేశ్వరరావు(బెబ్బులి) మాట్లాడుతూ మట్టితో తయారుచేసిన విగ్రహాలు పర్యావరణానికి ఎంతో మేలు చేస్తాయని అన్నారు. జనచైతన్య సమితి కార్యదర్శి తుల్లూరి సాంబశివరావు మాట్లాడుతూ కాలుష్య రహిత వినాయక చవితి జరుపు కోవాలని 15 సంవత్సరాలుగా మట్టి వినాయక ప్రతిమలను దాతల సహకారంతో పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జన చైతన్య సమితి ప్రతినిదులు వెలితోటి అనిల్ కుమార్,దాసరి కారుణ్య బాబు,కాట్రగడ్డ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా 350 వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు.

## విజిలెన్స్ అధికారుల తనిఖీలు



**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్):** మండల పరిధిలోని పలు ఎరువుల దుకాణాలలో గుంటూరు రీజినల్ విజిలెన్స్ మరియు ఎన్ఫోర్స్మెంట్ అధికారి డి.సూర్య శ్రవణ్ కుమార్ నేతృత్వంలో స్థానిక వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కాకుమాను మండల పరిధిలోని వల్లూరు గ్రామంలో సాయి ట్రేడర్స్ షాప్ నందు 0 ఫారం లు లేకుండా వ్యాపారం చేయుట వలన అనుమతులు లేని 9.45 మె.ట (189 బస్తాలు)ఎరువులు 2,55,150 రూపాయల విలువ గల నిల్వలకు స్టాప్ సేల్ నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. లక్ష్మి ప్రసాద్ ఫెర్టిలైజర్స్ కాకుమాను నందు 0 ఫారమ్స్ లేకుండా వ్యాపారం చేయుట వలన అనుమతులు లేని 1.05 ఎంటి(21) బస్తాలు సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ఎరువులను 12,915 రూపాయల విలువ గల ఎరువులను స్టాప్ సేల్ నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎరువుల షాప్ లలో ఎరువులను ఎం ఆర్ పి కంటే అధిక ధరలకు అమ్మితే అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యూరియా కృత్రిమ కొరత సృష్టించినట్లయితే సంబంధించిన వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి షాప్ ల్లోనూ ఎరువుల నిల్వలు,ధరల సూచిక బోర్డు లను తప్పనిసరిగా ఉంచాలని తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ చంద్ర శేఖర్,వ్యవసాయ అధికారి ఆది నారాయణ తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## డీఎస్సీ-2025 సెలక్షన్ జాబితా బహిర్గతం చేయాలి



○ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయీస్ అసోసియేషన్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** డీఎస్సీ-2025లో సెలక్షన్ జాబితాను బహిర్గతం చేయకుండా కేవలం కాల్ లెటర్ అందిన అభ్యర్థులను మాత్రమే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు పిలవడం పట్ల అభ్యర్థుల్లో గందరగోళం నెలకొంటుందని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయ్ భాస్కర్ విమర్శించారు. గురువారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ గతంలో డీఎస్సీ నియామకాలు నిర్వహించినప్పుడు ముందుగా మెరిట్ జాబితా విడుదల చేసి, తరువాత సెలక్షన్ జాబితా ప్రకటించి, సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించి నియామకాలు చేసినట్లు గుర్తు చేశారు. కానీ ఈసారి ఆ ప్రక్రియకు విరుద్ధంగా సెలక్షన్ జాబితా ప్రకటించకపోవడం అభ్యర్థుల్లో అనుమానాలకు దారితీస్తోందని, మెరిట్‌లో ఉన్నా కూడా కాల్ లెటర్ అందక ఇబ్బందులు పడుతున్న అభ్యర్థులు ఉన్నారని తెలిపారు. ఈ పరిస్థితిని సరిదిద్దేందుకు ప్రభుత్వం వెంటనే సెలక్షన్ జాబితాను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే డీఎస్సీ%-%2025లో ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలకు సెలెక్ట్ కాబడిన అభ్యర్థులకు, వారికి ఇష్టమైన పోస్టును ఎంపిక చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. రాష్ట్రం వెలుపల చదివి, గత ఏడు సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్‌లో నివాసం ఉంటూ డీఎస్సీ-2025లో మెరిట్ జాబితాలో ఎక్కువ మార్కులు సాధించిన అభ్యర్థులను 1975 ప్రెసిడెన్షియల్ ఆర్డర్ మేరకు స్థానికులుగా పరిగణించాలని విజ్ఞప్తి చేశారు.

## ఉపాధ్యాయులపై అదనపు భారం ఉండదు

○ తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్)** ఉపాధ్యాయులపై అదనపు భారం లేకుండా చర్యలు తీసుకుంటామని పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు హామీ ఇచ్చారు. గురువారం ఆయనను కలిసిన తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కొన్ని జిల్లాల్లో లోకల్ హాలిడే విషయంలో గందరగోళం ఏర్పడిన నేపథ్యంలో కమిషనర్ స్పందించారు. గతంలోలాగే మూడు స్థానిక సెలవులను జాతరలు లేదా పండుగలను దృష్టిలో ఉంచుకుని ఇవ్వవచ్చని, ఒక రోజు ముందుగానే పైఅధికారులకు తెలియజేయాలని సూచించారు. జిల్లా మొత్తం ఒకేసారి లోకల్ హాలిడేలు ప్రకటించరాదని స్పష్టం చేశారు.

ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఆన్లైన్ పనుల భారం రాకుండా త్వరలోనే అన్ని వర్క్‌ను ఎమ్మార్సీలలో ప్రత్యేక సిబ్బందితో పూర్తి చేయిస్తామని కమిషనర్ తెలిపారు. పిల్లల హాజరు నమోదు కోసం ఉదయం 10 గంటల వరకు సమయం ఇవ్వాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం విజ్ఞప్తి చేయగా, ఈ అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. అసెస్మెంట్ బుక్ విషయంలో ఉపాధ్యాయులు ఇవాల్యూషన్ చేసిన తర్వాత మార్కులు బబుల్ చేయాల్సిన అవసరం లేదని, అలాగే ఓఎంఆర్ షీట్లు అప్లోడ్ చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో, ఐఐటీ మద్రాస్ సహకారంతో అమలు చేస్తున్న విద్యాశక్తి పథకం ఐచ్ఛికమని తెలిపారు. ఇది విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరమని, ఆసక్తి ఉన్నవారికి ఉపాధ్యాయులు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి కొత్త గొర్ల వెంకటరావు, ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి యనమల ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి నల్లూరి వెంకట నరసింహారావు పాల్గొన్నారు.

## హీరో సుమన్ జన్మదిన వేడుకలు



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** పెదవడ్లపూడి కొత్తపాలెంలో మండల గౌడ సంఘం అధ్యక్షులు కంచర్ల రాజేష్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ప్రముఖ సినీ హీరో సుమన్ గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా రాష్ట్ర గౌడ్ సంఘం అధ్యక్షులు వాకా రామ్ గోపాల్ గౌడ్, నియోజకవర్గ గౌడ్ సంఘం అధ్యక్షులు వాకా మాధవరావు గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్ ను అతిథులు రామ్ గోపాల్ గౌడ్, మాధవరావు గౌడ్, నాయకులు కట్ చేశారు. అనంతరం సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామ్ గోపాల్ గౌడ్ మాట్లాడారు. ప్రముఖ సినీ హీరో సుమన్ 66వ జన్మదిన వేడుకలు గౌడ సంఘీయుల మధ్య జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. బీసీ వర్గం అయిన గౌడ సామాజిక వర్గంలో పుట్టి సినీ రంగంలో తన నటనా ప్రతిభను రుజువు చేసుకొని, తిరుగులేని నటుడుగా పేరు పొందిన సుమన్, గౌడ సామాజిక వర్గంలో పుట్టడం గౌడ సంఘీయులందరూ సంతోషించదగ్గ విషయం అన్నారు. బీసీ సంఘాలు, గౌడ్ సంఘాల కార్యక్రమాలలో పాల్గొంటున్న సుమన్ కు భవిష్యత్తులో మంచి జరిగి అభివృద్ధి పదంలో ముందుకు వెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ తాతా కోటయ్య, తంగిరాల గౌడ సంఘం అధ్యక్షులు జూపల్లి వెంకటేశ్వరరావు, సంఘం నాయకులు వాకా శ్రీనివాసరావు, నాగబాబు, వెంకటేష్, బాజీ, పోతురాజు శివరావు, దాసరి శ్రీనివాసరావు, చెన్ను బాలాజీ, చిట్టిబొమ్మ జగదీష్, శివగోపి, రామకృష్ణ, తాతా అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## యర్రబాలెంలో పట్ట పగలే చోరీ

○ ద్విచక్ర వాహనం, వెండి కుందులు, రూ.15వేల నగదు మాయం

**యర్రబాలెం (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి -తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెంలో పట్ట పగలే చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల మేరకు... యర్రబాలెం లోని నోరి వారి వీధికి చెందిన ఫణి శ్రీరామ్ చిట్స్ లో ఉద్యోగిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం వినాయక చవితి పండుగ కావడంతో ఇంటి తలుపులకు తాళాలు వేసి ఫణి తన భార్య తో కలిసి కారులో విజయవాడలోని తన తల్లిదండ్రుల నివాసానికి బయలుదేరి వెళ్లారు. అదే రోజు రాత్రి తిరిగి ఇంటికి వచ్చారు. తలుపు తాళాలు పగులగొట్టి ఉండటంతో పాటు ఇంటి ఆవరణలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైంది. లోపలికి వెళ్ళి చూడగా దేవుడి గదిలోని రెండు వెండి దీపపు కుందులతో పాటు హ్యాండ్ బ్యాగ్ లోని రూ.15వేల నగదు కూడా మాయమైంది. దీంతో బాధితుడు ఫణి తన నివాసంలో జరిగిన చోరీపై మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టారు.

**ద్విచక్ర వాహనాలు వరుసగా చోరీలు...**

మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి యర్రబాలెంలో గత కొన్ని రోజుల వ్యవధిలో మూడు ద్విచక్ర వాహనాలు చోరీకి గురైయ్యాయి. యర్రబాలెం కు చెందిన తాడేకోరు రమేష్ బాబు ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. యర్రబాలెం జానకీ అమ్మ వారి ఆలయం ప్రాంతానికి చెందిన మల్లేష్ ఇంటి ఎదుట రోడ్డుపై పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని దుండగులు చాకచక్యంగా దొంగిలించుకుని పారిపోయారు. తాజాగా నోరి వారి వీధికి చెందిన ఫణి నివాసంలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని సైతం దుండగులు మాయం చేశారు. యర్రబాలెం లో గత కొన్ని రోజుల వ్యవధిలోనే మూడు ద్విచక్ర వాహనాలు చోరీకి గురికావడం పట్ల పలువురు వాహనదారులు, స్థానిక ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

# విభిన్న ఆకృతుల గణపతి ఉత్సవ మూర్తులను దర్శించుకున్న ఎమ్మెల్సీ ఆలపాటి







○ సాదరంగా స్వాగతించిన ఉత్సవ కమిటీలు

**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్ )** ప్రపంచంలో హిందువులు ఎక్కడ ఉన్నా ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే తొలి పండుగ వినాయక చవితి పండుగని, ఈసంవత్సరం వివిధ ప్రాంతాల్లో,గణపతి ఉత్సవ కమిటీల ద్వారా పూజలందుకున్న గణపతి దేవుడు అందరికీ ఆయు, ఆరోగ్య, ఐశ్వర్యాలు ప్రసాదించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ నియోజక వర్గ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

పట్టణంలో గణపతి ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన గణపతి విగ్రహ మూర్తులను, పట్టభద్రులు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ గురువారం సాయంత్రం దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు. తొలుత తెనాలి మహేంద్ర షోరూం ఎదురుగా గల సరళ నగర్ లో నిర్వహించిన వినాయక విగ్రహ మహోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కు సాదర స్వాగతం పలికారు. అనంతరం సుల్తానాబాద్ మెయిన్ సెంటర్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ద్వితీయ గణపతి మహోత్సవాల్లో పాల్గొని గణపతి దేవునికి ఆశీస్సులు అందుకున్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సాదర స్వాగతం పలికి, పుష్ప గుచ్ఛాలు అందజేశారు. అదేవిధంగా సుల్తానాబాద్ లోని ట్రిబుల్ ఎక్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన గణపతి విగ్రహాన్ని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ దర్శించుకుని, కొబ్బరికాయ కొట్టి, పుష్పాలు సమర్పించారు. అనంతరం శివం ఎన్ క్లేవ్ అపార్ట్మెంట్ లో నిర్వహించిన, 13వ, గణపతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. అదేవిధంగా చెంచుపేటలోని యూని హోమ్స్ అపార్ట్మెంట్స్ లో నిర్వహించిన 12వ గణపతి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి విగ్రహాన్ని దర్శించుకున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కొబ్బరికాయ కొట్టి, స్వామి ఆశీస్సులు అందుకున్నారు. కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాల ప్రాధాన్యతను వివరించారు. జిల్లాలో ఈ సంవత్సరం డెబ్బయ్ వేల, గణపతి విగ్రహాలకు ఉత్సవ కమిటీల ద్వారా పూజలు నిర్వహించారని, ప్రథమ గణపతిని పూజించే ఆవశ్యకతను ప్రజలు అధికంగా గుర్తించారని, వినాయక చవితి పండుగ అందరికీ శుభాలు చేకూర్చాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ వెంట, పార్టీలోని పలువురు నాయకులు పాల్గొన్నారు.

## మైనారిటీలకు మేలు చేసే అవకాశం ... కలిసికట్టుగా పని చేద్దాం

○ ముస్లిం జీవితాల్లో వెలుగులు తీసుకొద్దాం

○ ఎమ్మెల్యే నసీర్ ను కలిసిన ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారు ఎంఏ షరీఫ్



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** మైనారిటీల జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చే గొప్ప అవకాశం సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వ రూపంలో వచ్చిందని, దీనికి అందరం కలిసికట్టుగా పని చేద్దామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారు ఎంఏ షరీఫ్ అన్నారు. బుధవారం గుంటూరులోని తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయానికి ఎంఏ షరీఫ్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఎమ్మెల్యే నసీర్ హృదయపూర్వక స్వాగతం పలికాం. రాష్ట్రంలో మైనారిటీ విద్యార్థుల భవిత, విద్యావకాశాల మెరుగుదల, ఉర్దూ టీచర్ల నియామకం, కడపలో హజ్ హౌస్ వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ గా నియమితులైన ఎమ్మెల్యే నసీర్ కు ఎంఏ షరీఫ్ అభినందలు తెలియజేస్తూ.. ఈ బాధ్యతల ద్వారా ముస్లింల సంక్షేమం, అభ్యున్నతికి మరింత కృషి చేసే అవకాశం వచ్చిందని, దీనిని సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ముస్లిం మైనారిటీ జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చేందుకు అవిశ్రాంతంగా పని చేయాలని ఇరువురు చర్చించారు.

## ప్రజలందరికీ గణనాధుని ఆశీస్సులు



**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్):** గణనాధుని ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లవేళలా ఉంటాయని ప్రత్తిపాడు శాసనసభ్యులు డా.బి.రామాంజనేయులు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని స్వర్ణ భారత్ నగర్, రత్నగిరి నగర్, పెదపలకలూరు పరిధిలోని పెదపలకలూరు, సత్య అపార్ట్మెంట్స్, బృందావన అపార్ట్మెంట్స్ లలో ఏర్పాటుచేసిన పలు వినాయక చవితి వేడుకలలో ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు డా. బూర్ల రామాంజనేయులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ గణనాథుని ఆశీస్సులతో ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు మరియు కూటమి ప్రభుత్వం చల్లని పాలన కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయ్యిందని ప్రజలందరూ జీవితాలలో విఘ్నాలు తొలగిపోయి సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కోరారు.

## అమరావతి పై దుష్ప్రచారం తగదు





**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** అమరావతిపై జరుగుతున్న తప్పుడు ప్రచారం రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఆటంకం కలిగిస్తోందని పలువురు నిపుణులు అభిప్రాయపడ్డారు. గురువారం విజయవాడలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో సి.ఆర్. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో "అమరావతిపై అబద్ధపు ప్రచారం - భావప్రకటన స్వేచ్ఛ" అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన వక్తగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ టీ. సునీల్ చౌదరి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఇచ్చిన భావప్రకటన స్వేచ్ఛతో పాటు దానికి సంబంధించిన బాధ్యతలను కూడా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. అబద్ధపు వార్తల ద్వారా సమాజంలో విద్వేషాలు రాకూడదని, పత్రికా రంగంలో విలువలను నిలబెట్టుకోవడం అత్యంత ముఖ్యమని సూచించారు. ముట్నూరి కృష్ణారావు, నార్ల వెంకటేశ్వరరావు, సి. రాఘవాచారి, ఎబికె ప్రసాద్ వంటి ప్రముఖులు పాటించిన విలువలు నేటి జర్నలిజంలో మరిచిపోతున్నాయన్న ఆవేదన వ్యక్తం చేశారు.

సభకు అధ్యక్షత వహించిన సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ మాట్లాడుతూ -రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కి రాజధాని అవసరం ఏర్పడిందని, అప్పుడు అమరావతిని రాజధానిగా ప్రకటించినప్పుడు ఎవరూ అభ్యంతరం చెప్పలేదన్నారు. అయితే 2019 తర్వాత అమరావతిపై దుష్ప్రచారం మొదలైందని, వర్షాలతో మునిగిపోయిందనే తప్పుడు ప్రచారం కూడా ఇప్పుడు కొనసాగుతోందని విమర్శించారు. "భావప్రకటన స్వేచ్ఛ" పేరుతో అబద్ధపు ప్రచారం చేయడం రాజ్యాంగ పరిమితులకు విరుద్ధమని స్పష్టం చేశారు. నీటిపారుదల నిపుణుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ -వర్షాలు, వరదలు సహజసిద్ధమని, కేరళ, చెన్నై, హైదరాబాదు, బెంగళూరు వంటి నగరాల్లో కూడా ఇలాంటి సమస్యలు వస్తాయని అన్నారు. అమరావతి ప్రాంతంలో వర్షపు నీటిని నిల్వ చేసుకోవడానికి ఆనకట్టలు, ప్రాజెక్టులు నిర్మించడం అవసరమని సూచించారు. ప్రముఖ చరిత్రకారుడు పాపినేని సాయి మాట్లాడుతూ - అమరావతికి వేల ఏళ్ల చారిత్రక ప్రాధాన్యం ఉందని, భౌద్ధ జైన సాంస్కృతిక వారసత్వాన్ని కలిగిన ఈ ప్రాంతం రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రాజధానిగా అభివృద్ధి చెందాలని అన్నారు. అమరావతి రైతు నాయకుడు జొన్నలగడ్డ కిరణ్ మాట్లాడుతూ -అమరావతి కేవలం రైతుల రాజధాని కాదని, యావత్తు ఆంధ్రప్రదేశ్ ప్రజల రాజధాని అని స్పష్టం చేశారు. తప్పుడు ప్రచారాలన్నిటినీ తట్టుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చరిత్రకారులు, రైతు నాయకులు, జర్నలిస్టులు, జేఏసి ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## తెనాలిలో విశాఖపట్నం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ప్రారంభం



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** విశాఖపట్నం కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ తమ సేవలను తెనాలి పరిసర ప్రాంతాల్లో విస్తరించేందుకు, గురువారం ఆర్బీఐ జనరల్ మేనేజర్ మహానా, చేతుల మీదుగా నూతన శాఖను ప్రారంభించారు. స్థానిక కొత్తపేటలో అధునాతనంగా రూపుదిద్దుకున్న విశాఖపట్నం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్, 57వ శాఖను ఆర్బీఐ జనరల్ మేనేజర్ మహాన, ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. బ్యాంకు ప్రాంగణంలోని వివిధ విభాగాలను స్థానికంగా ఉన్న ప్రముఖులుఅతిధులుగా పాల్గొని ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమా, కాకతీయ కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ డిఎల్ కాంతారావు, ది. తెనాలి అర్బన్ బ్యాంక్ చైర్మన్ మంగమూరి హరిప్రసాద్ అతిధులుగా పాల్గొని వివిధ విభాగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్ సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ 1916లో, విశాఖపట్నంలో ప్రారంభమైన విశాఖ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్, 1983 నుండి మానం ఆంజనేయులు చైర్మన్‌గా, అభివృద్ధి పదంలో ఖాతాదారులకు మెరుగైన సేవలతో శాఖలను పెంచుకోవడం జరిగిందన్నారు. దక్షిణ భారతదేశంలో అర్బన్ బ్యాంక్ సెక్టార్ లో,విశాఖ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 8వేల, కోట్ల వ్యాపార లావాదేవీలతో, తెనాలిలో 57వ బ్రాంచ్ ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని పలువురు వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. బ్యాంకు కార్యవర్గం కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## బదిలీల కోసం ఎంఈవో 1ల నిరీక్షణ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఎంఈఓ 1 లకు సాధారణ బదిలీలు వెంటనే చేపట్టాలని కోరుతూ రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ వి విజయ్ రామరాజుకు లేఖ ద్వారా ప్రాతినిధ్యం చేసినట్లు ఎంఈఓ 1 అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2017 నుంచి మెజారిటీ ఎంఇఓ 1 లు ఎనిమిదేళ్లుగా ఒకే చోట పని చేస్తూ అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తమ అసోసియేషన్ పక్షాన విద్యాశాఖ డైరెక్టర్ ని కలిసిన సందర్భంలో ప్రాతినిధ్యం చేయగా బదిలీలు కోసం హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అందువల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 679 మంది ఎంఈఓ 1 లు బదిలీల కోసం ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారని సామల అన్నారు. ఈ నేపథ్యంలోనే ఎంఈఓ12 లకుఅంతర్ జిల్లా బదిలీలకు అనుమతించడం హర్షనీయమైనప్పటికీ, ఇందువలన స్థానిక జిల్లాలలో ఎప్పటినుండో పనిచేస్తున్న ఎంఈఓ లకు మంచి ప్రదేశాలు లభించక అన్యాయం జరుగుతుందన్నారు. వాస్తవానికి ముందుగా సాధారణ బదిలీలు నిర్వహించిన అనంతరం అంతర్ జిల్లాల బదిలీలు నిర్వహించినట్లయితే అందరికీ ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కావున ముందుగా జీరో సర్వీస్ తో ఎంఇఓలకు సాధారణ బదిలీలు నిర్వహించేందుకు తగిన ఉత్తర్వులు జారీ చేయవలసిందిగా విద్యాశాఖ డైరెక్టర్ కు తమ లేఖలో విజ్ఞప్తి చేసినట్లు ఎంఈఓ 1 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయక్ బుక్యాలు తెలిపారు.

# సామాన్యుడు నుంచి ఒక సంస్థకు చైర్మన్‌గా నియామకం

○ ముఖ్యమంత్రి ఆశయాల మేరకు శక్తి వంచన లేకుండా పనిచేస్తా

○ గత 5 సంవత్సరాలు ప్రజల కోసం అనేక పోరాటాలు చేసా

○ వలవల మల్లిఖార్జునరావు (బాజ్జీ), ఆంధ్రప్రదేశ్ భవన మరియు నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** సామాన్యుడుగా ఉన్న నన్ను ముఖ్యమంత్రి ఎన్నో పదవులు ఇచ్చి ప్రోత్సహించారని ఆంధ్రప్రదేశ్ భవన మరియు నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లిఖార్జునరావు (బాజ్జి) తెలిపారు. ఆంధ్రప్రదేశ్ భవన మరియు నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ గా వలవల మల్లిఖార్జునరావు (బాజ్జి) గురువారం తాడేపల్లిలోని శ్రీనివాస కన్వెన్షన్ లో ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం చైర్మన్ వలవల మల్లిఖార్జునరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ భవన మరియు నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ గా నన్నునియామకం చేయడం సంతోషంగా ఉందని, అందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. నా సాయశక్తులా ఆ పదవికి వన్నె తెస్తానన్నారు. కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం నా శక్తి వంచన లేకుండా పనిచేసి వారికి న్యాయం చేస్తానన్నారు. అంతేకాకుండా నాయకుడు పిలుపును అందుకుని పనిచేయడమే లక్ష్యంగా అలవాటు చేసుకున్నానన్నారు. నాకు పదవి రావడంలో నాకు అండగా ఉన్న నాయకులకు, కార్యకర్తలకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. తాడేపల్లిగూడెం కు చెందిన ప్రతి ఒక్కరూ నా వెంటే నిలవటం నేను ఎప్పటికీ మరువలేనన్నారు. నాకోసం తాడేపల్లిగూడెం నుంచి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. గత 5 సంవత్సరాలు తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ప్రజా వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేశామన్నారు. నేను చేసిన అన్ని పోరాటాల్లో నియోజకవర్గానికి చెందిన ప్రజలు నావెంటే నిలిచి నాతో కలిసి వచ్చారన్నారు.. ముందుగా స్టేజీ పై ఉన్న స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహానికి నాయకులు పుష్పాంజలి ఘటించారు. ఆంధ్రప్రదేశ్ భవన మరియు నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ గా వలవల మల్లిఖార్జునరావు ఉదయం 11 గంటలకు చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేశారు.

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ గత 5 సంవత్సరాల్లో ఎన్నో పోరాటాలు చేసిన వ్యక్తి వలవల మల్లిఖార్జునరావు అన్నారు. కూటమి పొత్తులో భాగంగా మల్లిఖార్జునరావు కు ఎమ్మెల్యే టికెట్ రాలేదని, దాని పర్యవసానంగానే ఇప్పుడు చైర్మన్ పదవి వచ్చిందన్నారు. కూటమి సభ్యుల్లో ఏమైనా సమస్యలు ఉంటే అందరూ కూర్చుని మాట్లాడుకుని పరిష్కరించుకోవాలన్నారు. నా దృష్టికి వచ్చిన అన్ని సమస్యలు పరిష్కరిస్తున్నానన్నారు. ఆంధ్రప్రదేశ్ భవన మరియు నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ గా వలవల మల్లిఖార్జునరావు ఇంకా పేరు ప్రఖ్యాతలు తెచ్చుకుంటారని ఆశిస్తున్నానన్నారు.

కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ కార్మిక శాఖలో 3 బోర్డులు ఉంటాయన్నారు. కార్మిక సమస్యలు మీద ఆ బోర్డుకు ఉన్న ప్రాముఖ్యత పై ఆలోచించి వలవల మల్లిఖార్జునరావుకు చైర్మన్ పదవిని అందించారన్నారు.

గత ప్రభుత్వంలో ఈ బోర్డును విచ్ఛిన్నం చేశారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సరైన సంస్థకు చైర్మన్ గా మల్లిఖార్జునరావును నియమించారన్నారు. గత 5 సంవత్సరాలు చైర్మన్ వలవల మల్లిఖార్జునరావు ఎన్నో పోరాటాలు చేశారన్నారు. నియోజకవర్గంలో అన్న క్యాంటీన్లను రద్దు చేసినా ఈయన ఎంతో మంది సహకారంతో నిర్వహించారన్నారు.

మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ ఒక మంచి నాయకుడుకి ఒక మంచి పదవి ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ లు అందించటం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా ఆ పిలుపును అందుకుని మల్లిఖార్జునరావు పనిచేశారన్నారు. మాజీ మంత్రి, శాసనసభ్యులు పితాని సత్యన్నారాయణ మాట్లాడుతూ కార్మికులకు సమస్యలు మీద పోరాటం చేయడంలో ఆయనకు ఆయనే చాటి అని అన్నారు.

కార్యక్రమంలో శాసనసభ్యులు మద్దిపాటి వెంకట్రాజు, బడేటి రాధాకృష్ణ, నాయకులు ఆదిరెడ్డి అప్పారావు, గన్ని వీరాంజనేయులు, ఎపి టైలర్స్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి, తదితర నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467